

రంజాన్ వేళలు	ఇఫ్తార్ (సోమ)	సా.6.20
	సహరి (మంగళ)	ఉ.4.53

హృదయాలను కదిలించిన అన్నదాత
ఉమ్మడి కబడ్డీ జట్ల ఎంపిక 7
మోరిని మెచ్చిన ముర్ము!

హద్దు.. దాటనివ్వదు!

బోటుకు బిగిస్తున్న యంత్రం



సముద్రంలో మత్స్యకారుల రక్షణకో మిషన్

ప్రస్తుతం చాలా మంది తండేల్ సినిమా చూసే ఉంటారు.. ఆ సినిమాలో హీరో టీమ్ వేటకు వెళ్లి సముద్రంలో అనుకోకుండా పాకిస్థాన్ సరిహద్దుల్లోకి వెళ్లిపోతారు..ఆ జైలులో మగ్గిపోతారు.. చివరు హీరోయిన్ పోరాడి వారి ని విడిపిస్తుంది.. ఇది రియల్ స్టోరీగా డైరెక్టర్ కథనం.. ఇది నిజమే..ఎందుకంటే సముద్రంలో సరిహద్దులు దాటితే ప్రమాదమే.. అటువంటి ప్రమాదాల నుంచి మత్స్యకారులను తప్పించ డానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ట్రాన్స్‌పాండర్ అనే యంత్రాన్ని బోట్లకు బిగిస్తున్నాయి.



- ఇక 'హద్దు'ల్లో ఉంచేస్తుంది
- బోట్లకు ట్రాన్స్‌పాండర్లు
- ఒక్కో మిషన్ ఖరీదు రూ.21 వేలు
- దేశ హద్దులు దాటకుండా అలెర్ట్
- కి.మీ దూరంలోనే హెచ్చరికలు
- వేటకు వెళ్లే మత్స్యకారులకు రక్షణ
- అప్రమత్తమై వచ్చేందుకు వీలు
- ఇతర దేశాల జైళ్లలో ఎంతో మంది

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి సముద్రంలో చేపల వేటకు వెళ్లే మత్స్యకారులు అనేక మంది పొరపాటున పొరుగు దేశాల్లోకి వెళ్లి జైలు పాలవుతున్నారు. తెలియకుండా చేసిన తప్పునకు ఏళ్లకు ఏళ్లు ఆయా దేశాల జైళ్లలో మగ్గుతున్నారు. ఇకపై మత్స్యకారులకు ఆ బాధలు తప్పనున్నాయి. సముద్రంలో వేటాడుతున్న బోటు పొరుగు దేశాల సరిహద్దుల్లో అడుగుపెట్టే ప్రమాదం ఉంటే కిలోమీటరు దూరంలో ఉండగానే ఒక యంత్రం హెచ్చ రిస్తుంది. ఆ యంత్రా లను ఇప్పుడు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో మత్స్యకారుల బోట్లకు అధికారులు బిగిస్తున్నా రు. రూ.21 వేల విలువైన ఒక్కో యంత్రాన్ని మత్స్యశాఖ ఉచితంగా ఇస్తోంది.కేంద్రం,రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా నిధులను భరించి మత్స్యకారులకు ఇస్తుండగా బిగింపు ముమ్మరమైంది.

హద్దు దాటితే జైలే..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 67 వేల కుటుంబాలకు పైగా చేపల వేటపై ఆధారపడి జీవిస్తున్నాయి. ఇందులో 48 వేల కుటుంబాలు వరకు సముద్రంలో చేపల వేట ద్వారా బతుకు తున్నారు. వీరిలో అనేక మంది మత్స్యకారులు మెకనైజ్డ్ బోట్లపై వారాల తరబడి చెన్నై, ముం బై, గుజరాత్, ఒడిషా తదితర రాష్ట్రాల సముద్ర జలాల్లో ప్రయాణించి చేపల వేట సాగిస్తారు. ఈ క్రమంలో అనేక మంది మత్స్యకారులు తెలి యకుండా పాకిస్తాన్, బంగ్లాదేశ్, శ్రీలంక దేశాల సముద్ర జలాల్లోకి ప్రవేశిస్తున్నారు. దీంతో అక్కడ పోలీసులకు పట్టుబడి ఏళ్ల తరబడి ఆయా దేశాల జైళ్లలో మగ్గిపోతున్నారు.అటు వీరిని విడిపించడం సైతం కేంద్ర ప్రభుత్వానికి పెద్ద సవాల్‌గా మారిపోతోంది.2018 నవం బరు లో ఐ.పోలవరం మండలానికి చెందిన కొందరు మత్స్యకారులు పాకిస్తాన్ జలాల్లోకి వెళ్లి జైళ్లలో మగ్గిపోయారు. అనేక మంది మత్స్యకారులు ఈ తరహా సమస్యలు తరచూ ఎదుర్కొంటున్నారు.

తొలుత వాటికే..

కాకినాడ జిల్లాలో 76 కిలోమీటర్ల మేర సముద్రతీరం ఉంది. తీరం వెంబడి 23 ఫిష్ ల్యాండింగ్ సెంటర్ల ద్వారా 4,150 బోట్లు చేపల వేటకు అనుమతి పొందాయి. ఈ బోట్ల ద్వారా 36,112 మంది ఆధారపడి జీవిస్తున్నారు. వీటిలో తొలుత సుదీర్ఘతీరం సముద్రంలో వేటకు వెళ్లే మెకనైజ్డ్ బోట్లకు ఈ యంత్రాలను బిగిస్తున్నారు. తొలి విడత కింద ఉమ్మడి జిల్లాలో 1,600 బోట్లకు ఈ యంత్రాలను అమర్చాలని జిల్లా మత్స్యశాఖ లక్ష్యం విధించుకుంది. ఇందులో ఇప్పటి వరకు 350 బోట్లకు ట్రాన్స్‌పాండర్లు బిగించారు. మిగిలిన బోట్లకు బిగించే ప్రక్రియ కొనసాగుతోంది. మోటరైజ్డ్ బోట్లకు సైతం వీటిని బిగించాలని అధికారులు కసరత్తు చేస్తున్నారు. ట్రాన్స్‌పాండర్లు బిగించాలంటే సంబంధిత బోట్లలో బ్యాటరీలు నిరంతరం పనిచేస్తుండాలి. ప్రస్తుతం ఇవి ఉన్న బోట్లకే యంత్రాలు బిగిస్తున్నారు. అటు కోనసీమ జిల్లాలో 64 వరకు మెకనైజ్డ్ బోట్లు ఉన్నాయి.వీటికి కూడా బిగింపు ప్రక్రియ కొనసాగుతోంది. ప్రస్తుతం భైరవపాలెంలో ఉన్న బోట్లకు కోనసీమ జిల్లా మత్స్యశాఖ అధికారులు యంత్రాలను అమర్చేపనిలో ఉన్నారు. తూర్పుగోదావరి జిల్లాలో మెకనైజ్డ్ బోట్లు ఉన్నా సముద్రంలో వేటకు వెళ్లేవి తక్కువే.

బోట్లకు కుయ్..కుయ్

కేంద్రం మత్స్యకారుల భద్రతకు పీఎంఎం ఎస్‌వై పథకం కింద ట్రాన్స్‌పాండర్లను ప్రవేశ పెట్టింది. వీటిని సముద్రంలో వేటకు వెళ్లే బోట్లకు అమర్చుతోంది. ట్రాన్స్‌పాండర్లు ఉన్న బోట్లు పొరపాటున పొరుగుదేశాల సముద్ర జలాల్లోకి వెళ్లే ప్రమాదం ఉంటే కిలోమీటరు దూరం ఉండగానే హెచ్చరిస్తాయి. తద్వారా పొరుగు దేశాలకు చిక్కుకోకుండా మత్స్యకారులు సురక్షితంగా ఉండేలా ఇవి కీలకపాత్ర పోషించనున్నాయి.ఒక్కో ట్రాన్స్ పాండర్ ధర రూ.21 వేలు.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఉచితంగా ఇస్తున్నాయి.ప్రస్తుతం వీటి బిగింపు కాకినాడ, కోనసీమ జిల్లాల్లో ఊపందుకుంది. ట్రాన్స్‌పాండర్లు ఉన్న బోట్లను అటు రాష్ట్ర ప్రభుత్వం, ఇటు కేంద్ర ప్రభుత్వం తరచూ పర్యవేక్షించనున్నాయి. తద్వారా అంతర్జాతీయ సరిహద్దుల దగ్గరకు వెళ్లే ముప్పు ఉంటే హెచ్చరించడంతో పాటు సముద్రంలో తుపాన్లు, ఇతర ఆపద ఏది ఎదురైనా కాపాడేందుకు సిద్ధంగా ఉంటాయి.ఒకసారి ట్రాన్స్‌పాండర్‌ను బోటుకు బిగించిన తర్వాత శాటిలైట్‌తో బోటు అనుసంధానం అయిపోతుంది. తద్వారా ఏ సమస్య వచ్చినా మత్స్యకారులకు ఇబ్బంది ఉండదు.ఇన్‌కాయిస్ (ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషన్ ఇన్ఫర్మేషన్ సర్వీస్) ద్వారా సముద్రంలో చేపలు ఎక్కువ ఎక్కడ ఉన్నాయనే సమాచారం సైతం ఎస్ఎంఎస్‌ల ద్వారా ఇన్‌కాయిస్‌నుంచి మత్స్యకారులకు అందుతుంది.

నో ఛాన్స్!



- ఒక్కరినీ వరించని ఎమ్మెల్సీ పదవి
- ఉమ్మడి జిల్లా నేతల్లో నిరాశ
- ఆశావహులకు బుజ్జగింపులు
- వచ్చేసారి చూద్దామని హామీ

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని కూటమి నేతలకు నిరాశ ఎదురైంది.. ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీ పదవి ఆశించిన నేతల ఎదురుచూపులు ఫలించలేదు.. పదవి తప్ప కుండా వస్తుందని ఆశించిన నాయకులకు నిరాశే మిగిలింది. ముఖ్యంగా తెలుగుదేశం పార్టీ నుంచి ఎక్కువ మంది ఎమ్మెల్సీలు ఆశించారు. ఉమ్మడి జిల్లాలో ఒక రెండు ఎమ్మెల్సీలు లభిస్తాయని అంతా ఊహించినా లెక్కతప్పింది. అధిష్ఠానం ఒక్కటీ కేటాయించలేదు.

పలువురికి నిరాశే..

సార్వత్రిక ఎన్నికల్లో కూటమిలో సీట్ల సర్దుబాట్ల మధ్య కొందరికి టికెట్లు దక్కలేదు. అప్పుడు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలువురు నేతలకు ఎమ్మెల్సీ కోటాలో చూద్దామని పార్టీ అధిష్ఠానం హామీ ఇచ్చింది.ఈ నేపథ్యంలో చాలా మంది ఎదురు చూశారు. కానీ రాష్ట్రంలో కేవలం ఐదు ఎమ్మెల్సీ స్థానాలు మాత్రమే ఖాళీ అవ్వడం వల్ల తెలుగుదేశం 3, జనసేన 1, బీజేపీ 1 కేటాయించారు. దీని వల్ల ఆశావహులకు అవకాశం రాలేదు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ,నిడదవోలు మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావుకు పదవి ఇస్తామని అధిష్ఠానం హామీ ఇచ్చింది. కొవ్వూరు మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి కెఎస్ జవహర్‌కు హామీ ఇచ్చినట్టు ప్రచారం జరిగింది. ఇక కోనసీమ నుంచి మాజీ ఎమ్మెల్సీ రెడ్డి సుబ్రహ్మణ్యం కూడా పదవి ఆశించారు.రాష్ట్రంలో ఎక్కువగా ఆశించే వారి సంఖ్య బాగా పెరడంతో అధిష్టానానికి ఇబ్బందికరంగా మారింది. సర్దుబాట్ల వల్ల పలువురు ఎమ్మెల్సీ ఆశలు నీరుగారిపోయాయి.ఈ మేరకు సీఎం చంద్రబాబు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌తో మాట్లాడి తర్వాత ఎప్పుడు ఎమ్మెల్సీ ఖాళీ అయినా హామీ ఇచ్చిన వారికి ఇస్తామని చెప్పాలని ఆదేశించారు.ఈ నేపథ్యంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ఇద్దరు నేతలకు ఫోన్ చేసి పరిస్థితిని వివరించారు. 2027లో ఎక్కువ ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ అవుతాయని..అప్పుడు మీకు కచ్చితంగా స్థానం కల్పిస్తామని స్వయంగా సీఎం చంద్రబాబు చెప్పమన్నారని చెప్పడం గమనార్హం.

యనమలకు కీలక పదవి?

ప్రస్తుతం ఎమ్మెల్సీగా ఉన్న ఆర్థిక శాఖ మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు పదవి కాలం ఈనెల 29తో ముగియనుంది. ఈసారి ఆయన ఎమ్మెల్సీని ఆశించినా దక్కలేదని సమాచారం. సీఎం చంద్రబాబుకు సన్నిహితుడు, టీడీపీలో కీలకనేతగా ఉన్న యనమలకు త్వరలోనే మరో కీలక పదవి రానున్నట్టు ప్రచారం జరుగుతోంది. రాజ్యసభ సభ్యత్వం వస్తుందని లేదా గవర్నర్ పదవి లభిస్తుందనే ప్రచారం ఉంది.తుని నియోజకవర్గం పరిధిలోని తేటగుంటలో హైవే సమీపంలో తోటలోని ఆయన ఇంటివద్ద ఇటీవల పెద్ద గేటు నిర్మిస్తుండడంతో పాటు, గేటు సమీపంలో బంకర్ కూడా ఏర్పాటు చేస్తున్నట్టు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఏదో కీలక పదవి రాబోతుందనే ప్రచారం ఊపందుకుంది.

నియోజకవర్గానికి.. ఒకటి



- జిల్లాలో ఏడు నియోజకవర్గాల్లో ఇండస్ట్రియల్ పార్కులు
- నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఏర్పాటుకు చర్యలు
- ఉత్పత్తి, ఉపాధి, ఉద్యోగాల కల్పన లక్ష్యంగా ముందడుగు
- ప్రైవేటుతోపాటు ప్రభుత్వ భూమి గుర్తించే దిశగా చర్యలు
- ఒక్కొక్క నియోజకవర్గంలో వంద ఎకరాల వరకు గుర్తింపునకు అధికార యంత్రాంగం కసరత్తు
- ఫుడ్‌ప్రాసెసింగ్, ఆక్వా, వ్యవసాయ ఉత్పత్తి యూనిట్ల ఏర్పాటు
- ఇప్పటికే పెద్దాపురంలో 40 ఎకరాల భూమి గుర్తింపు

కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో మరో ముందడుగు పడుతోంది. చిన్న, సూక్ష్మ తరహా పరిశ్రమల ఏర్పాటుకు కార్యాచరణ సిద్ధమవుతోంది. ఉత్పత్తి, ఉద్యోగ, ఉపాధి దిశగా భారీ ప్రణాళిక రూపకల్పన జరుగుతోంది. ఏడు నియోజకవర్గాల్లో ఏడు ఇండస్ట్రియల్ పార్కుల ఏర్పాట్లకు కసరత్తు జరుగుతోంది. వీటి ఏర్పాటుతో జిల్లా దిశ మారుతుంది. పరిశ్రమల ద్వారా వందల కోట్ల రూపాయిల పెట్టుబడులు రానున్నాయి. దీంతో వస్తు ఉత్పత్తి పెరగడంతోపాటు విదేశీ ఎగుమతులు కూడా పెరుగుతాయని భావిస్తున్నారు. తద్వారా పన్నుల ద్వారా ప్రభుత్వానికి ఆదాయం, యువతకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు కలగనున్నాయి.

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 9(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. దీనిలో కాకినాడ అర్బన్, కాకినాడ రూరల్, పిఠాపురం, తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట, పెద్దాపురం అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. ఒక్కొక్క నియోజకవర్గంలో వంద ఎకరాల్లో ఇండస్ట్రియల్ పార్కుల ఏర్పాటుకు కసరత్తు జరుగుతోంది. ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూమలతోపాటు ప్రైవేటు భూములు సేకరించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఏ నియోజకవర్గంలోనైనా ప్రభుత్వ భూములు లేకపోతే అక్కడ ప్రైవేటు భూములను సేకరించనున్నారు. జిల్లావ్యాప్తంగా మొత్తంగా 700 ఎకరాల భూమిని గుర్తించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. పెద్దాపురం నియోజకవర్గంలో ఇప్పటికే 40ఎకరాల వరకు ప్రభుత్వ భూమిని గుర్తించారు. మిగిలిన నియోజకవర్గాల్లో ప్రభుత్వ భూమిని గుర్తించేందుకు రెవెన్యూ అధికారులు రికార్డులను పరిశీలిస్తున్నారు. ప్రైవేటు భూమి సేకరించేందుకు రూ.400కోట్లు ఖర్చవుతుందని అధికారులు ప్రాథమికంగా ఒక అంచనాకు వచ్చారు.

మౌలిక సదుపాయాల కల్పన

ఇండస్ట్రియల్ పార్కుల్లో రహదారులు, విద్యుత్, నీరు వంటి మౌలిక సదుపాయాలను రాష్ట్ర ప్రభుత్వం కల్పించనుంది. పరిశ్రమల ఏర్పాటుకు అన్నీ అనుమతులను ఇస్తుంది. ప్రత్యేకంగా మూలధర రాయితీ కూడా ఇస్తుంది. ఖాయిలా పడ్డ పరిశ్రమలకు ఊతమందించే దిశగా కూడా చర్యలు తీసుకుంటుంది. కాకినాడ సిటీ వంటి అర్బన్ ప్రాంతాల్లో భూమి అందుబాటులో లేకపోతే నానోపార్క్‌లు, ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌లు ఏర్పాటు చేసేందుకు అధికారులు సమాలోచనలు చేస్తున్నారు. వీటి ఏర్పాటువల్ల అర్బన్ ప్రాంతాల్లో నిరుద్యోగుల ఉపాధి కొరత పూర్తిగా తీరనుంది.

పది నుంచి వందమందికి ఉపాధి

గత వైసీపీ ప్రభుత్వం చిన్న, సూక్ష్మ తరహా పరిశ్రమల ఏర్పాటుపై పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకపోవడం వల్ల పెద్దఎత్తున యువత హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి మహా నగరాలకు వలస వెళ్లిపోయారు. అలాంటి పరిస్థితి రాకూడదనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం ఇండస్ట్రియల్ పార్కుల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఈ ఇండ స్ట్రియల్ పార్కుల్లో ఏర్పాటయ్యే యూనిట్లలో పదినుంచి వందమంది వరకు ఉపాధి పొందే అవకాశం ఉంది. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఇది ఒక సువర్ణ అవకాశం. చిన్న, సూక్ష్మ తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నావారికి శుభవార్త.

వదిలేసిన ప్రభుత్వ ఇళ్ల స్థలాలు

గత ప్రభుత్వంలో పేదలకు ఇళ్లస్థలాలను పంపిణీ చేయగా కొన్నిచోట్ల లబ్ధిదారులు గృహాలు నిర్మించుకోలేదు. అవి నిరుపయోగంగా ఉన్నాయి. వాటినికూడా ఇండస్ట్రియల్ పార్కుల ఏర్పాటుకు అధికారులు పరిశీలిస్తున్నారు.

ఏపీఐఐసీ ఆధ్వర్యంలో భూకేటాయింపు

భూమి సేకరించిన తర్వాత ఏపీఐఐసీ ఆధ్వర్యంలో ఔత్సాహిక సూక్ష్మ, చిన్నతరహా పారిశ్రామికవేత్తలకు కేటాయింపులు జరుగు తాయి. దీనిలో ప్రధానంగా ఒకకోటి రూపాయిలనుంచి రూ.ఐదుకోట్ల వరకు పెట్టుబడులు పెట్టే చిన్నతరహా పరిశ్రమలను స్థాపిస్తారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, ప్యాకింగ్‌యూనిట్లు, ఆక్వా, వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తుల ప్రాసెసింగ్ యూనిట్లు స్థాపిస్తారు. బయోటెక్నాలజీ, ఏరోస్పేస్ డ్రోన్లు, ఎలక్ట్రిక్ వాహనాలు, జెమ్స్ జ్యూయలరీ, తోళ్ల ఫుట్‌వేర్ వంటి యూనిట్లు ఏర్పాటు చేసు కోవచ్చు. ఫార్మాస్యూటికల్స్, సెమీకండక్టర్ ఎల క్ట్రానిక్స్, టెక్స్‌టైల్స్, బొమ్మల తయారీ యూనిట్లు, ఎంఎస్ఎంఈ యూనిట్లు, టెస్టింగ్ ల్యాబ్‌లు, గోదాములు, ముడి సరుకుల డిపోలు ఏర్పాటు అవుతాయి.

ప్రభుత్వ భూములను గుర్తించాలని ఆదేశించాం: కలెక్టర్

ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏడు ఇండస్ట్రియల్ పార్కుల ఏర్పాటుకు ప్రభుత్వ, అసైన్డ్ భూములను గుర్తించాలని రెవెన్యూ అధికారులకు ఆదేశాలిచ్చాం. ప్రభుత్వ భూములు అందుబాటులో లేని నియోజకవర్గాల్లో ల్యాండ్ సేకరిస్తాం. జిల్లాలో చిన్న, సూక్ష్మ తరహా పరిశ్రమలు, ఎంఎస్ఎంఈలు ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఇండస్ట్రియల్ పార్కులను ఏర్పాటు చేస్తాం. ఆయా పార్కుల్లో రోడ్లు, డ్రైన్లు, విద్యుత్ వంటి అన్ని మౌలిక సదుపాయాలను కల్పిస్తాం. కాకినాడ సిటీ వంటి అర్బన్ ప్రాంతాల్లో నానోపార్క్‌లు, ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌లు ఏర్పాటు చేసి ఔత్సాహికులైన పారిశ్రామికవేత్తల పరిశ్రమల ఏర్పాటు కల నెరవేరుస్తాం.

దర్జాగా కబ్జా

- పంట కాలువల్లో నిర్మాణాలు.. ఆపై ఆక్రమణ
- లేఅవుట్లు, నిర్మాణాల్లో కలిపివేసుకుంటున్న వైనం
- రూ.15కోట్లు విలువ చేసే ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం
- అధికారుల తీరుపై అనుమానాలు



పిఠాపురం బైపాస్‌రోడ్డు పక్కన పంట కాలువలో ఇటీవల సీసీ డ్రెయిన్ నిర్మించి గ్రావెల్‌తో నింపి పూడ్చివేసిన దృశ్యం

పంట కాలువలను దర్జాగా కబ్జా చేసేస్తున్నా రు. ప్రభుత్వ స్థలాలను వదలడం లేదు. సాగునీరు ప్రవహించే కాలువల్లో డ్రెయిన్లు నిర్మించి ఆపై ఆక్రమించి తమ స్థలాల్లో కలుపుకుంటున్నారు. లేఅవుట్లు వేసే రియల్టర్లు, భవనాలు నిర్మించేవారు ఇరిగేషన్, ప్రభుత్వ స్థలాలు, ఎన్‌హెచ్ ఆర్‌అండ్‌బీకి చెందిన స్థలాలు ఆక్రమించి మరీ బహిరంగంగా నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు అటువైపు చూడడంలేదు.

(ఆంధ్రజ్యోతి, పిఠాపురం)

పిఠాపురం బైపాస్‌రోడ్డుతోపాటు 216వ జాతీయ రహదారి చెంతన ఉన్న పంట కాలువలు ఆక్రమణకు గురవుతున్నాయి. వీటిని పరిరక్షించాల్సిన ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు ప్రేక్షక పాత్ర పోషిస్తుండడంతో ఆక్రమణదారులు రెచ్చిపోతున్నారు. ఎక్కడికక్కడ కాలువలపై డ్రెయిన్లు, ఇతర నిర్మాణాలు చేపట్టి ఆపై వాటిని తమ స్థలాల్లో కలిపివేసుకుంటున్నారు. లేఅవుట్లు వేసేందుకువీలుగా పంటభూములనుఎత్తు చేసే క్రమంలో గ్రావెల్‌తో కాలువలను పూడ్చివేయడంతోపాటు డ్రెయిన్లు నిర్మిస్తున్నారు.

పంట కాలువలో డ్రెయిన్ నిర్మాణం

పిఠాపురం బైపాస్‌రోడ్డులో రాపర్తి-అగ్రహారం జంక్షన్‌నుంచి భీమ్‌నగర్ జంక్షన్‌కు వెళ్లే రహదారి చెంతనే ఉన్న పంటపొలాలను ఇటీవల గ్రావెల్‌తో ఎత్తుచేశారు. దీన్ని లేఅవుట్‌గా అభివృద్ధి చేసేందుకు రియల్టర్లు పనులు నిర్వహిస్తున్నారు. పొలాలు చెంతనే ఉన్న పంట కాలువలో చిన్న సీసీ డ్రెయిన్ నిర్మించారు. మిగిలిన భాగాన్ని తొలుత గ్రావెల్‌తో నింపివేశారు. ఆ తర్వాత డ్రెయిన్‌పై శ్లాబులు వేసి పూర్తిగా పూడ్చివేశారు. అక్కడే కాలువను పూర్తిగా మూసివేసి రహదారి ఏర్పాటు చేశారు. పంట కాలువల్లో ఏ నిర్మాణం చేపట్టాలన్నా ఇరిగేషన్ అధికారుల అనుమతి తీసుకోవాలి. పంటకాలువ స్వరూపాన్ని మార్చకూడదు. జాతీయ రహదారి చెంతనే ఏ నిర్మాణాలు చేపట్టాలన్నా ఆర్ అండ్‌బీ ఎన్‌హెచ్ అధికారుల అనుమతి తీసుకోవాలి. ఇవేమీ లేకుండానే కాలువలను ఆక్రమించి డ్రెయిన్ నిర్మించారు.

బైపాస్‌రోడ్డు, ఇతర రహదారులపై..

పిఠాపురంబైపాస్‌రోడ్డుకు ఇరువైపులా పంట పొలాలున్నాయి. వీటిని లేఅవుట్లుగా అభివృద్ధి చేయడంతోపాటు పలు వాణిజ్య సముదాయాలు, హోటళ్లు నిర్మిస్తున్నారు. నిర్మాణ సమయంలో రహదారికి ఇరువైపులా ఉన్న పంట కాలువలను ఆక్రమిస్తున్నారు. 4.5 కిలోమీటర్ల పొడవున్న పిఠాపురం బైపాస్‌రోడ్డుకు ఇరువైపులా 44కిపైగా ప్రాంతాల్లో పంటకాలువలు, ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. పలుచోట్ల కాలువలను పూర్తిగా మూసివేశారు. ఒకటి, రెండు చోట్ల మాత్రమే ఇరిగేషన్ అధికారుల అనుమతి తీసుకుని కాలువ ఎంత వెడల్పు ఉందో అంతమేర కాంక్రీటుతో నిర్మాణాలు పూర్తి చేశారు. మిగిలిన ప్రాంతాల్లో నిర్మాణాలకు అనుమతులు లేవు. పిఠాపురం బైపాస్ రోడ్డుజంక్షన్‌నుంచి కోర్టుల ప్రాంగణం వరకూ ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న కాలువలను, ప్రభుత్వస్థలాలు, డి.ఫారం పట్టాభూములు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. గ్రావెల్‌తో కాలువలను మూసివేశారు. పాదగయ సెంటర్‌నుంచి కుమారపురం, ఎఫ్‌కెపాలెం, జల్లూరు మీదుగా సామర్లకోట వరకూ, పిఠాపురం బైపాస్ జంక్షన్ నుంచి గొల్లప్రోలు టోల్‌గేట్‌వరకూ, పిఠాపురం బైపాస్ విరవాడ జంక్షన్ నుంచి కోలంక వరకూ కాలువలు, ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురయ్యాయి.

పెరిగిన ముంపు

బైపాస్‌రోడ్డులో పంటకాలువలతోపాటు నీరుపోయే మార్గాలను ఎక్కడిక్కడ మూసివేసి నిర్మాణాలు చేపట్టడతో ముంపు సమస్య అధికమైంది. గతేడాది వచ్చిన ఏలేరు వరదల ముంపు అన్ని ప్రాంతాల్లో వారంరోజుల వ్యవధిలో తొలగిపోతే బైపాస్‌రోడ్డులో మాత్రం నెలరోజులపాటు ముంపు కొనసాగింది. నీరు బయటకుపోయే మార్గాలు లేకపోవడమే ఇందుకు ప్రధాన కారణమని అప్పట్లో ఇరిగేషన్ అధికారులు గుర్తించినా ఆక్రమణల తొలగింపునకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో విమర్శలకు గురవుతోంది.

అధికారులు ఏం చేస్తున్నారు

పిఠాపురం బైపాస్‌రోడ్డు, సామర్లకోట, 216వ జాతీయ రహదారి, విరవాడ రోడ్డు తదితర ప్రాంతాల్లో ఆక్రమణలకు గురైన నిర్మాణాలు చేపట్టిన ఇరిగేషన్‌శాఖకు చెందిన పంటకాలువలు, ప్రభుత్వస్థలాల విలువ రూ.15కోట్ల వరకూ ఉంటుందని అంచనా. రహదారుల వెంబడి భూముల విలువలు గణనీయంగా పెరిగిపోవడంతో లేఅవుట్లు వేసేవారు కాలువ, ఇతర ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలు చేపట్టి వాటిని కలిపివేసుకోవడం ద్వారా అదనప్రయోజనం పొందుతున్నారని చెబుతున్నారు. ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాల్సిన ఇరిగేషన్, రెవెన్యూ, ఎన్‌హెచ్ ఆర్‌అండ్‌బీ అధికారులు చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

పరిశీలన జరిపి చర్యలు తీసుకుంటాం

-శేషగిరిరావు, ఇరిగేషన్ ఈఈ, పెద్దాపురం

పంట కాలువలను రియల్టర్లు, భవనాలు నిర్మించేవారు ఆక్రమించి డ్రెయిన్లు, ఇతర కట్టడాలు నిర్మిస్తున్నారనే విషయంపై పరిశీలన చేసి చర్యలు తీసుకుంటాం. నిర్మాణాలకు ఏ అనుమతులు లేవు. విచారణ నిర్వహించాలని ఇరిగేషన్ డీఈఈని ఆదేశించాం. పంట కాలువలను ఆక్రమించడం లేదా వాటి స్వరూపం మార్చేలా నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటాం. పిఠాపురం బైపాస్‌రోడ్డుకు ఇరువైపులా పంటకాలువలు ఉన్నాయి. వాటి పరిరక్షించేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తాం.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 9(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారం నిమిత్తం ఏర్పాటు చేసిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ సోమవారం ఉదయం 10గంటలనుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతుందని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా అధికారులంతా హాజరుకావాలన్నారు.

జనసేన నుంచి ప్రత్తిపాడు ఇన్‌చార్జి
తమ్మయ్యబాబు సస్పెండ్
- ప్రత్తిపాడు ప్రభుత్వాస్పత్రి వైద్యురాలిపై దుర్భాషలు
- దీనిపై ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సీరియస్
మెయిన్‌లో..

ఆవిర్భావ సభకు మహిళలను ఆహ్వానించేందుకు
జనసేన వినూత్న కార్యక్రమం
- బొట్టు పెట్టి పిలిచేలా కాకినాడలో ఆహ్వాన పత్రికను ఆవిష్కరించిన మంత్రి నాదెండ్ల మనోహర్
7

పెద్దిపాలెంలో రాష్ట్రస్థాయి ఎడ్ల పరుగు పందాలు
7
సర్పవరంలో వైభవంగా శ్రీరామచంద్రమూర్తి విగ్రహ ప్రతిష్ఠ

అందపు అ(మ)ంచు!

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పలుచోట్ల మంచు దుప్పటి పంట పొలాలు, జాతీయ రహదారి వెంబడి మార్గాలను కప్పేస్తోంది. ఆ అందమైన దృశ్యాలను ఆంధ్రజ్యోతి కెమెరా క్లిక్ మనిపించిందిలా..


ప్రత్తిపాడు హైవేపై...


రౌతులపూడిలో సూర్యోదయాన..


పిఠాపురంలో పొలాలపై..

కోరుకొండ నరసన్న కల్యాణోత్సవాలు ప్రారంభం



అంకురార్పణకు పుట్టమన్ను తవ్వుతున్న అర్చక స్వాములు, అంకురార్పణ చేస్తున్న దృశ్యం


విద్యుత్ కాంతుల్లో నరసింహస్వామి కొండ

కోరుకొండ, మార్చి 9(ఆంధ్రజ్యోతి): నవ నరసింహ క్షేత్రాల్లో ఒకటైన స్వయంభూ కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాలు ఆదివారం రాత్రి ఆలయ ముఖ మండపంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. అంతకుముందు మంగళ వాయిద్యాలు, మేళతాళాలతో శ్రీచక్ర పెరు మాళ్లను తీసుకుని దేవుడి కోనేటి వద్దకు వెళ్లి పుట్టకు శాస్త్రోక్తంగా పూజలు చేసి పుట్టమన్ను సేకరించారు. అనంతరం ఆలయం వద్ద అంకురార్పణ, ధ్వజారోహణ కార్యక్రమాలు పాణింగపల్లి పవన్కుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో అనువంశిక ధర్మకర్త పరాసర రంగరాజభట్టర్ పర్యవేక్షణలో నిర్వహించారు. వార్షిక బ్రహ్మోత్సవాలకు అన్నవరం దేవస్థానం అధికారులు పర్యవేక్షణలో వివిధ ప్రభుత్వ శాఖాధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేశారు. సోమవారం రథోత్సవం సందర్భంగా ఏ అవాంచనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ వైశ్రీకాంత్, సీఐ వై.సత్యకిషోర్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు ఆలయం వద్ద పోలీస్ అవుట్పోస్టు ఏర్పాటు చేశారు. జాతరలో అవాంచనీయ సంఘటనలు జరగకుండా కోరుకొండ మొత్తం సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉంచామని డీఎస్పీ తెలిపారు. స్వామివారి కల్యాణోత్సవాల నిర్వహణకు అన్నవరం దేవస్థానం ఈవో వీర్ల సుబ్బారావు, ఛైర్మన్ వైవీ రోహిత్, కోరుకొండ దేవస్థానం ఛైర్మన్ రంగరాజ భట్టర్, ప్రత్యేక సిబ్బంది తరలివచ్చారు. దేవదాయ, ధర్మదాయ శాఖ నుంచి ఉత్సవాలకు 250మంది సిబ్బందిని నియమించారు. దేవదాయ, ధర్మదాయ శాఖ నుంచి డిప్యూటేషన్పై మరికొంత మంది సిబ్బంది, అర్చకస్వాములు, వేద పండితులు వచ్చారు.

నేడు రథోత్సవం, కల్యాణం...

స్వామివారి రథోత్సవం సోమవారం మధ్యాహ్నం 1.56గంటలకు నిర్వహించనున్నారు. రథోత్సవానికి ముందు స్వామిని పెండ్లి కుమారుడు, అమ్మవారిని పెండ్లి కుమార్తెగా అలంకరించి ప్రత్యేక పల్లకిలో మంగళ వాయిద్యాలు, మేళతాళాల మధ్య తోడ్కొని వచ్చి రథంపై ఆసీనులను చేస్తారు. రథానికి ప్రత్యేక పూజలు చేసి వేలాదిమంది భక్తుల గోవింద నామస్మరణ మధ్య దేవస్థానం నుంచి రథోత్సవం బయలుదేరుతుంది. రాత్రి 9గంటలకు కల్యాణ మహోత్సవం వైభవంగా జరుగుతుంది. ఈ మేరకు స్వామి కల్యాణ మండపాన్ని విశేష పుష్ప అలంకరణలతో సిద్ధం చేశారు. రథోత్సవం అనంతరం ఎదుర్కోలు సన్నాహంతో నూతన వస్త్రాలు, సుగంధ ద్రవ్యాలు సమర్పించి మేళతాళాలతో స్వామి, అమ్మవార్లను రథం పై నుంచి ప్రత్యేక పల్లకీలో ఆలయానికి తోడ్కొని వస్తారు. రాత్రి 8గంటల సమయంలో మంగళస్నానం నిర్వహిస్తారు. వైఖానస ఆగమశాస్త్రం ప్రకారం స్వామి కల్యాణం రాత్రి 9 గంటలకు జరుగుతుంది.

సర్పవరంలో వైభవంగా
శ్రీరామచంద్రమూర్తి విగ్రహ ప్రతిష్ఠ

చిన్నజీయర్స్వామి చేతులమీదుగా నిర్వహణ


శ్రీసీతారాముల కల్యాణం దృశ్యం


విగ్రహ ప్రతిష్ఠా మహాక్రతువులో పాల్గొన్న చిన్నజీయర్స్వామి

సర్పవరం జంక్షన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : కాకినాడ జిల్లా సర్పవరంలో 160 ఏళ్ల క్రితం నిర్మించిన హనుమ, లక్ష్మణ సహిత శ్రీసీతారామ చంద్రస్వామి ఆలయ జీర్ణోద్ధరణ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం ఆదివారం అశేష భక్తుల శ్రీరామ నామస్మరణ నడుమ అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ ధర్మకర్త పురాణం వెంకటాచార్యులు, వెంకటాచార్యులు, ధరణిధరచార్యుల ఆధ్వర్యంలో జరిగిన ఈ మహాకుంభ సంప్రోక్షణ మహాక్రతువులో త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్స్వామి పాల్గొన్నారు. స్వామివారికి ప్రాతఃఆరాధన, సేవాకాలం, చతుఃస్థానార్చన, తత్త్వన్యాస హోమం, గర్తన్యాసం, రత్నన్యాసం, యంత్ర స్థాపన, బింబ స్థాపన, శ్రీసుదర్శన పెరుమాళ్ల, నమ్మాళ్వార్, భగవద్ రామానుజాచార్యస్వామి తదితర పూజలు జరిపారు. విశేష పూజలు అనంతరం అశేష భక్తుల నడుమ విగ్రహమూర్తులకు చిన్నజీయర్ స్వామి స్వహస్తములతో పునర్వసు నక్షత్రయుక్త వృషభ లగ్న సముహూర్తంలో మహాకుంభ సంప్రోక్షణ, దృష్టికుంభ, మంగళద్రవ్య దర్శనం కావించారు. ఈ సందర్భంగా వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ శాస్త్రోక్తంగా శ్రీసీతారాముల కల్యాణం నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠా, ధ్వజ స్తంభం స్థాపనకు ముందు భక్తులను ఉద్దేశించి చిన్నజీయర్ స్వామి అనుగ్రహభాషా పారాయణం చేశారు. కార్యక్రమంలో సాతులూరి గోపాల కృష్ణమాచార్యస్వామి, త్రిదండి చిన్న రామచంద్ర జీయర్స్వామి, గోవిందా జియ్యర్, త్రిదండి అహోబిల రామానుజజీయర్స్వామి పాల్గొన్నారు. అధిక సంఖ్యలో భక్తులు తరలిరాగా అన్నప్రసాద వితరణ చేశారు.

పెద్దిపాలెంలో రాష్ట్ర స్థాయి ఎడ్ల పరుగు పందాలు


పందెంలో పరుగు పెడుతున్న ఎద్దులు

ప్రత్తిపాడు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం పెద్దిపాలెం గ్రామంలో ఆదివారం రాష్ట్రస్థాయి ఎడ్ల పరుగు పందాల పోటీలు నిర్వహించారు. సీనియర్స్ విభాగంలో ధర్మవరానికి చెందిన జువ్వల సత్తిబాబు ఎడ్ల జతకు ప్రథమ బహుమతి లభించింది. కాకినాడకు సమీపంలోని కొవ్వాడకు చెందినమట్టా నవనీత్ శ్రీమణికంఠ ఎడ్ల జతకు ద్వితీయ స్థానం, సామర్లకోట మండలం జి.మేడపాడుకు చెందిన మలిరెడ్డి అన్నపూర్ణ ఎడ్ల జతకు తృతీయస్థానం లభించాయి. అలాగే జూనియర్స్ విభాగంలో కోనసీమకు చెందిన కాపవరం కుంచం మనోజ్ ఎడ్ల జతకు ప్రథమ బహుమతి, రాజమండ్రి సమీపంలోని హుకుంపేటకు చెందిన కురమళ్ల వీరవెంకటసత్య జయవర్ధన్ ఎడ్ల జతకు ద్వితీయ బహుమతి, కాకినాడకు సమీపంలోని కొవ్వాడకు చెందిన మట్టా నవనీత్ శ్రీమణికంఠ ఎడ్లజతకు తృతీయ బహుమతి లభించాయి. సీనియర్ విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు షీల్డ్లతో పాటు రూ.12వేలు, రూ.10వేలు, రూ.8 వేలు నగదును పెద్దిపాలెనికి చెందిన రెడ్డి పాపమ్మ, గైపూరి శ్రీను, నలమాట రాజు అందజేశారు. జూనియర్స్ విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు రూ.10వేలు, రూ.8 వేలు, రూ.6వేలతో పాటు షీల్డ్లను పెద్దిపాలెనికి చెందిన కొల్లి శ్రీనివాస్, రాజమండ్రికి చెందిన ఆకుల రామకృష్ణ, శాంతి ఆశ్రమానికి చెందిన రోమాల నాగరాజు అందజేశారు. పోటీల్లో సీనియర్స్ విభాగంలో అనకాపల్లి, ఉమ్మడి తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాల వ్యాప్తంగా 24ఎడ్ల జతలు పాల్గొన్నాయి. పోటీలకు న్యాయ నిర్ణేతలతుగా యనమల కృష్ణ, చేరుకూరి రామకృష్ణ, సిద్ద నానాజీ, కంటే ఫణికుమార్ వ్యవహరించారు.

టిప్పర్ ఢీ కొని యువకుడి మృతి


మృతిచెందిన నానిబాబు

నిడదవోలు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు విద్యుత్ శాఖ డివిజనల్ కార్యాలయం సమీపంలో టిప్పర్ వ్యాన్ ఢీకొని ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న యువకుడు సంఘటన స్థలంలోనే మృతిచెందాడు. మృతుడు నిడదవోలు మండలం పందలపర్రు గ్రామానికి చెందిన సంకు నాని బాబు(19)గా గుర్తించారు. నానిబాబుకు తల్లి సోదరీ మాత్రమే ఉండగా సోదరికి వివాహం జరిగిందని, తాపీ కార్మికుడిగా పనిచేసుకుంటూ తల్లి పోషిస్తున్నాడని స్థానికులు తెలిపారు. ఈ ఘటనపై పట్టణ ఎస్ఐ పరమహంస కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాద సంఘటన జరిగిన వెంటనే వ్యాన్ డ్రైవర్ పోలీస్స్టేషన్లో లొంగిపోయినట్టు సమాచారం.

డివైడర్ను ఢీకొని జొన్నల్లంక యువకుడి మృతి


సాయివెంకట కృష్ణ (ఫైల్)

పి.గన్నవరం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): ఉపాధి నిమిత్తం హైదరాబాద్ వెళ్లిన జొన్నల్లంక యువకుడు రోడ్డు ప్రమాదానికి గురై మృతిచెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం లంకగన్నవరం శివారు జొన్నల్లంక గ్రామానికి చెందిన సందాడి సాయివెంకటకృష్ణ(20), లంకే బాలమణికంఠలక్ష్మీసాయి ఉపాధి నిమిత్తం హైదరాబాద్లో వెల్డింగ్ పనులు చేసుకుంటున్నారు. శనివారం రాత్రి 11 గంటల సమయంలో పని ముగించుకుని తమ రూమ్కు ద్విచక్రవాహనంపై తిరిగి వెళ్తుండగా వనస్థలిపురంలో ప్రమాదవశాత్తు డివైడర్ను బలంగా ఢీకొన్నారు. ఇద్దరిని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. వెంకట కృష్ణ మృతిచెందగా,బాలమణికంఠ చికిత్స పొందుతున్నాడు.

ఆవిర్భావ సభకు మహిళలను ఆహ్వానించేందుకు
జనసేన వినూత్న కార్యక్రమం

బొట్టు పెట్టి పిలిచేలా ఆహ్వాన పత్రికను ఆవిష్కరించిన మంత్రి నాదెండ్ల


కాకినాడలో ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న మంత్రి నాదెండ్ల, ఎమ్మెల్యే పంతం నానాజీ

కలెక్టరేట్ (కాకినాడ), మార్చి 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం మండలం చిత్రాడ గ్రామంలో ఈనెల 14న నిర్వహించనున్న జనసేన ఆవిర్భావ సభకు మహిళలను ఆహ్వానించేందుకు వినూత్న కార్యక్రమానికి పార్టీ శ్రీకారం చుట్టిందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. ఇంటింటికి వెళ్లి బొట్టు పెట్టి ఆడపడుచులను ఆహ్వానించేలా ప్రత్యేకంగా రూపొందించిన బొట్టు స్టిక్కర్లతో కూడిన ఆహ్వాన పత్రికను ఆదివారం కాకినాడ కంట్రోల్ రూమ్లో ఆవిష్కరించారు. పార్టీ అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం పవన్కల్యాణ్ తరుపున ఆడపడుచులకు ఇంటింటికి వెళ్లి బొట్టు పెట్టి సభకు ఆహ్వానించేలా పార్టీ వీరమహిళ విభాగానికి చొరవ తీసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో శాసనమండలిలో ప్రభుత్వ విప్ పిడుగు హరి ప్రసాద్, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, మాజీ మంత్రి పడాల అరుణ, మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, సివిల్ సప్లైస్ కార్పొరేషన్ ఛైర్మన్ తోట సుధీర్ ఉన్నారు.

గిరిజన విద్యార్థిని మృతదేహానికి
పోస్టుమార్టం జరగకుండా అడ్డగింత


ఏరియా ఆసుపత్రి ముందు ఆందోళన చేస్తున్న దృశ్యం

రంపచోడవరం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): రంపచోడవరం మండలం వాడపల్లి ఆశ్రమ పాఠశాలలో ఆత్మహత్య చేసుకున్న గిరిజన విద్యార్థిని మృతదేహానికి ఆదివారం పోస్టుమార్టం జరగనీయకుండా సీఐటీయూ నాయకులు అడ్డుకున్నారు. పాఠశాల నిర్వహకులు సరైన పర్యవేక్షణ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడమే సదరు విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిందని సీఐటీయూ రాష్ట్ర నాయకురాలు మట్ల వాణిశ్రీ ఆరోపించారు. నాయకులు, వాడపల్లి గ్రామస్థులు, మృతురాలి బంధువులతో కలిసి రంపచోడవరం ఏరియా ఆసుపత్రి ముందు ఆందోళన చేపట్టారు. మృతురాలి కుటుంబానికి రూ.25 లక్షల పరిహారం చెల్లించాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, ఇందుకు హామీ లభించే వరకూ పోస్టుమార్టం జరగనిచ్చేది లేదన్నారు. పోలీసులు, ఐటీడీఏ అధికారులు వచ్చి ఆందోళనకారులతో మాట్లాడినా ప్రయోజనం లేకపోయింది. కాగా ఉపాధ్యాయులు, సిబ్బంది కలిసి మృతురాలి కుటుంబానికి న్యాయం చేస్తామని, పరిహారాన్ని కూడా తమ వంతుగా అందజేస్తామని చర్చలు జరపడంతో ఆందోళన ముగిసింది. అనంతరం పోలీసుల పర్యవేక్షణలో పోస్టుమార్టం నిర్వహించి విద్యార్థిని మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

స్వగ్రామంలో ఎమ్మెల్సీకి ఘన స్వాగతం


ఎమ్మెల్సీకి స్వాగతం పలుకుతున్న అభిమానులు

ఐ.పోలవరం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం యానాం-ఎదుర్లంక బ్రిడ్జి వద్ద ఇటీవల పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఎన్నికైన పేరాబత్తుల రాజశేఖర్కు ఆదివారం అభిమానులు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్సీ హోదాలో తొలిసారి స్వగ్రామం జి.వేమవరం వచ్చిన ఆయనకు కూటమి నాయకులు, అభిమానులు మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద ఆధ్వర్యంలో బాణసంచా కాల్చి స్వాగతం పలికారు. తొలుత ఆయన బ్రిడ్జి వద్ద అంబేడ్కర్, జీఎంసీ బాలయోగి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాతయింజరం సెంటర్లో ఎదుర్లంక గ్రామస్తులు రాజశేఖర్ను గజమాలతో సత్కరించారు. అనంతరం ప్రచార రథంపై బైక్ ర్యాలీ నడుమ ఊరేగింపుతో స్వగ్రామం జి.వేమవరం చేరుకున్నారు. పాతయింజరం సెంటర్ నుంచి ఎదుర్లంక, గుత్తెనదీవి, జి.వేమవరం, జి.మూలపొలం వరకు ఈర్యాలీ జరిగింది.



మోరిని మెచ్చిన ముర్ము!

మోరి చీరను కొన్న రాష్ట్రపతి

అంతర్వేది, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్లో ఏర్పాటుచేసిన అమృత్ మహోత్సవ్ సౌత్ ఇండియాలో భాగంగా ఆంధ్రప్రదేశ్ తరఫున కోనసీమ జిల్లా మోరి చేనేత సంఘం ద్వారా ఏర్పాటు చేసిన స్టాల్లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేనేత చీరను కొనుగోలు చేశారు. రూ.1200 విలువగల ఈ చేనేత చీరను ఆమె కొనుగోలు చేసినట్టు మోరి చేనేత సొసైటీ మేనేజర్ అంకం రామలింగేశ్వరప్రసాద్ తెలిపారు. మోరి చీరల పనితనాన్ని ఆమె ప్రశంసించి నాణ్యతపై సంతృప్తి వ్యక్తంచేశారు.

హృదయాలను కదిలించిన అన్నదాత


అన్నదాత నాటకంలో ఓ సన్నివేశం

గొల్లప్రోలు రూరల్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): పంటల సాగులో రైతులు ఎదుర్కొంటున్న కన్నీటి కష్టాలను, వారిని ప్రభుత్వాలు ఆదుకోవాల్సిన ఆవశ్యకతను వివరిస్తూ ప్రదర్శించిన అన్నదాత నాటకం అందరి హృదయాలను కదిలించింది. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో అపర్ణా కళాతోరణం బత్తుల మురళీకృష్ణ కళావేదికపై అపర్ణా నాటక కళాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉభయ తెలుగురాష్ట్రాల నాటకాల పోటీల్లో భాగంగా రెండోరోజు హైదరాబాద్కు చెందిన కళాంజలి కళాకారులు ప్రదర్శించిన అన్నదాత నాటకం ప్రేక్షకుల కంట తడి పెట్టించింది. వల్లూరి శివప్రసాద్ నాటికను రచించగా, కొల్లా రాధాకృష్ణ దర్శకత్వం వహించారు.

ఉమ్మడి కబడ్డీ జట్ల ఎంపిక

సామర్లకోట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి కబడ్డీ క్రీడా పోటీలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల తరఫున పోటీ చేసేందుకు జూనియర్, సబ్ జూనియర్ కేటగిరిలలో బాలుర, బాలికల జట్ల క్రీడాకారులు ఎంపిక పోటీలు ఆదివారం కాకినాడ సామర్లకోట అయోధ్యరామపురం మున్సిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించారు. జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి కొండపల్లి శ్రీనువాసు, ప్రో కబడ్డీ రిఫరీ బొగిళ్ళ మురళీకుమార్, డీవీశ్రీనివాసు, కోశాధికారి నిమ్మకాయల కిరణ్కుమార్ పర్యవేక్షణలో పోటీలు నిర్వహించి ప్రతిభ చాటినవారిని ఎంపిక చేశారు.

రేషన్ బియ్యం పట్టివేత

పెరవలి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): పశ్చిమగోదావరి జిల్లా ఖండవల్లి జాతీయ రహదారిపై పది టన్నుల రేషన్ బియ్యాన్ని రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తూర్పువిప్పర్రు నుంచి అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెనికి హైషర్ వ్యాన్లో బియ్యాన్ని తరలిస్తున్నట్టు సమాచారం అందడంతో సివిల్ సప్లయ్, తహశీల్దార్ ఎస్ఎస్ సుధీర్రెడ్డి తెల్లవారుజామున ఖండవల్లి వద్ద జాతీయ రహదారిపై పట్టుకున్నారు. వాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. డ్రైవర్ వైచర్ల శివ కిరణ్ను అదుపులోకి తీసుకుని వ్యాన్ను పెరవలి పోలీసులకు అప్పగించారు.

5 దశాబ్దాల బంధం.. అద్వితీయం!


గొల్లప్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో కలిసిన పదో తరగతి పూర్వ విద్యార్థులు

గొల్లప్రోలు, మార్చి 9(ఆంధ్రజ్యోతి): కలిసి చదువుకున్న వారంతా 5 దశాబ్దాల తర్వాత తిరిగి కలుసుకున్నారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1973-74బ్యాచ్కు చెందిన పదో తరగతి విద్యార్థులు ఆదివారం అదే పాఠశాల వేదికగా కలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలతో తడిచి ముద్దయ్యారు. పూర్వ విద్యార్థులు దంగేటి అప్పన్న, ఒంటెద్దు రామలింగం, కొసిరెడ్డి రామకృష్ణ, పేరాజు, నారాయణ, చక్కపల్లి ధర్మరాజు 3ఏళ్లుగా కృషిచేసి అందరూ ఒకేచోట చేరేలాచేయడంలో సఫలీకృతులయ్యారు.

కాకినాడలో...

కాకినాడ రూరల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జగన్నాధపురంలోని ఎంఎస్ఎన్ ఛారిటీస్ డిగ్రీకళాశాల పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఐడియల్ కళాశాల ఆవరణలోని సెమినార్హాల్లో ఆదివారం జరిగింది. కళాశాలలో బీకాం చదివిన మొదటి, రెండవ బ్యాచ్(1971-74, 1972-75) విద్యార్థులు సమావేశమై 50 వసంతాల సంబరాలను నిర్వహించుకున్నారు. ఉత్సాహంతో, కేరింతలతో ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఆనాటి తమ గురువులైన ఎస్ఎం కొంపెల్ల, వీఎల్ గాంధీలను సత్కరించారు.



కాకినాడ ఎంఎస్ఎన్ ఛారిటీస్ డిగ్రీ కళాశాలలో కలిసిన పూర్వ విద్యార్థులు

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం

కార్పొరేషన్(కాకినాడ), మార్చి 9(ఆంధ్రజ్యోతి): కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ నిర్వహించను న్నట్లు కమిషనర్ భావన తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో నిలిచిన ప్రజాఫిర్యాదుల వ్యవస్థ కార్యక్రమం తిరిగి సోమవారం నుంచి పునః ప్రారంభించినట్లు ఆమె తెలిపారు. అర్జీదారులు గుర్తించి సద్వినియోగం చేసుకోవాలన్నారు.



పిఠాపురంలోని టిడ్కో అపార్ట్‌మెంట్ల వద్ద నిరసన తెలుపుతున్న సత్యవతి, టీడీపీ కౌన్సిలర్లు

టిడ్కో అపార్ట్‌మెంట్ల కేటాయింపులో మతలబు

● ఒకరిది మరొకరికి ఇచ్చేశారు

● నిరసన తెలిపిన లబ్ధిదారు సత్యవతి

పిఠాపురం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్ధేశించిన మొత్తాన్ని చెల్లించి టిడ్కో అపార్ట్‌మెంట్ పొందిన తనకు అన్యాయం చేసే విధంగా ఈ ప్లాటును మరొకరికి కేటాయించారంటూ పడాల సత్యవతి అనే మహిళ ఆదివారం అపార్ట్‌మెంట్లువద్ద ఆందోళనకు దిగింది. ఈమెకు మద్దతుగా టీడీపీ కౌన్సిలర్ కోళ్ల బంగారుబాబు, ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు వేణం సురేష్ తదితరులు అక్కడకు చేరుకుని ఆందోళన నిర్వహించారు. 2017లో తెలుగుదేశంపార్టీ ప్రభుత్వ హయాంలో తనకు టిడ్కో అపార్ట్‌మెంట్ కేటాయించగా, నాలుగు విడతలుగా రూ.లక్ష చెల్లించినట్లు తెలిపారు. 2020 లోనూ తనకు తిరిగి సీ12లో ఎఫ్1 అపార్ట్‌మెంటు కేటాయిస్తున్నట్లు లేఖ ఇచ్చారని చెప్పారు. తాను లక్షలాది రూపాయలు వ్యయం చేసి రిపేర్లు చేయించుకున్నానని తెలిపారు. కానీ ఇప్పుడు ఇదే అపార్ట్‌మెంట్‌ను మిరియాల నారాయణమ్మ తనకు కేటాయించారంటూ ప్లాటుకు తాళం వేసుకుందని చెప్పారు. సత్యవతికి న్యాయం చేయాలని బంగారుబాబు, వేణం సురేష్‌లు డిమాండ్ చేశారు. ఒకరికి కేటాయించిన ప్లాటును రూ.4లక్షలకు కొనుగోలు చేసినట్లు మరో మహిళ చెబుతుందంటే ఇందులో జరిగిన గోల్‌మాల్ అర్థం చేసుకోవచ్చునని తెలిపారు. టిడ్కో అపార్ట్‌మెంట్ల కేటాయింపు వ్యవహారంపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న దేవాంగ సంక్షేమం నాయకులు

దేవాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషిచేయాలి

● సంఘ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

పెద్దాపురం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): దేవాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషిచేయాలని సంఘ అధ్యక్షుడు వూటుకూరి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి అన్నారు. స్థానిక ముప్పన రామారావు చేనేత కల్యాణ మండపంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. ప్రధాన అజెండాగా అమరావతి రాజధానిలో ప్రభుత్వం సహకారంతో దేవాంగ భవన్ నిర్మాణం, పేద దేవాంగులను ఆర్థికంగా ఆదుకోవాలని తీర్మానం చేశారు. కూటమి నేతలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఈశ్వరరావు, అయితాబత్తుల ఆనందరావు, కందికుంట ప్రసాద్ అసెంబ్లీ సమావేశాల్లో చేనేతల సమస్యలపై వారి కష్టాల గురించి ప్రభుత్వానికి తెలియజేసినందుకు రాష్ట్ర సంఘం ద్వారా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి మాడిశెట్టి శివ శంకరయ్య, కోశాధికారి కొండపల్లి పరమేశ్వర రావు, బండారు ఆనందప్రసాద్, ముప్పన వీర్రాజు, మచ్చా నిరంజన్ పాల్గొన్నారు.

నిరంతరం ప్రజాసేవ చేస్తే

కమ్యూనిస్టులను ప్రజలు ఆదరిస్తారు

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు



'నవ సమాజం కోసం' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, నాయకులు

కాకినాడ సిటీ, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): అమరవీరుల స్ఫూర్తితో నిరంతరం ప్రజాసేవ చేస్తే కమ్యూనిస్టులను ప్రజలు తప్పనిసరిగా ఆదరిస్తారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్థానిక అన్నదాన సమాజంలో ఆదివారం జరిగిన 'నవ సమాజం కోసం' పుస్తకావిష్కరణ సభకు సీపీఎం జిల్లా కార్యదర్శి కరణం ప్ర సాదరావు అధ్యక్షత వహించారు. ఈ సభలో ముఖ్యవక్తగా రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు ప్రసంగించారు. కమ్యూనిస్టు ఉద్యమచరిత్ర అంటే ఆ కాలంలో ప్రజా పోరాటాల చరిత్రే అన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లాలో స్వాతంత్రోద్యమ కాలంలోనే కమ్యూనిస్టు బీజాలు పడ్డాయన్నారు. ఆనాడు కాకినాడ అన్నదాన సమాజంలో రహస్యంగా పార్టీ ఏర్పడిందన్నారు. ఉమ్మడి జిల్లాలో 1934-64 మధ్య కాలంలో కమ్యూనిస్టు ఉద్యమ ఘట్టాలను వివరిస్తూ జిల్లా కమిటీ సభ్యుడు దువ్వ శేసబాబ్జీ 'నవ సమాజం కోసం' పేరుతో పుస్తకం రచించడం అభినందనీయమన్నారు. అమరుల స్ఫూర్తితో ప్రజల నుంచి నేర్చుకుని ఉద్యమాన్ని బలోపేతం చేసుకోవాలన్నారు. డాక్టర్ చెలికాని స్టాలిన్, డాక్టర్ పి.చిరంజీవిని కుమారిలతో పాటు సీపీఐ నాయకులు తాటిపాక మధు, బోడకొండ, కె.సత్తిబాబు, న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎ.వెంకటేశ్వర్లు, లిబరేషన్ నాయకులు గొడుగు సత్యనారాయణ, చిన్న బిల్లి నాగేశ్వరరావు, కొండ దుర్గారావు, టి.అరుణ్ మాట్లాడుతూ దేశాన్ని మతోన్మాద శక్తుల నుంచి కాపాడుకోవాలన్నారు. అదే విధంగా ఐక్య ఉద్యమాలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఈ సభలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఏవీ నాగేశ్వరరావు, పుస్తక రచయిత దువ్వ శేషబాబ్జీ, జిల్లా, నగర కమిటీ సభ్యులు జి.బేబిరాణి, కేఎస్ శ్రీనివాస్, సీహెచ్ రమణి, పలివెల వీరబాబు, సీహెచ్ రాజ్‌కుమార్, ఎం.రాజశేఖర్, మలక వెంకటరమణ, కె.నాగజ్యోతి, చంద్రావతి, చంద్రమళ్ల పద్మ పాల్గొన్నారు. ప్రజానాట్య మండలివారు ఆలపించిన గీతాలు అలరించాయి.

ప్రతి ఇంటికీ వెళ్లి ఆవిర్భావ సభకు ఆహ్వానించండి

● జనసేన సమన్వయకర్త రాజు

పిఠాపురంరూరల్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటికి వెళ్లి పిఠాపురం మండలం చిత్రాడ శివారులో ఈనెల 14వ తేదీన నిర్వహించే జనసేన ఆవిర్భావ సభకు ఆహ్వానించాలని జనసేన పార్టీ చోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జి, సభ పిఠాపురం సమన్వయకర్త పీవీఎస్ఎన్ రాజు కోరారు. జనసేనపార్టీ ఆవిర్భావ సభను విజయవంతం చేయాలని కోరుతూ పిఠాపురం మండలం చిత్రాడ, మాధవపురం, నవఖండ్రవాడ, బిప్రత్తిపాడు, భోగాపురం, రాయవరం గ్రామాల్లో ఆయన ఆది వారం ఉదయం నుంచి రాత్రి వరకూ విస్తృతంగా పర్యటించారు. ఆ యా గ్రామాల్లో జనసేన నాయకులు, జనసైనికులు, వీరమహిళలతో సమావేశాలు నిర్వహించారు. పిఠాపురం శాసనసభ్యుడిగా ఉన్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రజలందరికి ఇదే వేదికగా కృతజ్ఞతలు తెలిపేందుకు ఆవిర్భావ సభను ఇక్కడ నిర్వహించాలని నిర్ణయించారని తెలిపారు. ప్రజలందరినీ ఆవిర్భావ సభకు తరలివచ్చేలా అందరూ కృషి చేయాలని కోరారు. జనసేన నాయకులు ఊటా నానిబాబు, వెన్నా జగదీష్, వెన్నపు చక్రధరరావు, పిల్లా దినేష్ పాల్గొన్నారు.

ఆవిర్భావ సభ ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్యే

పిఠాపురం: పిఠాపురం మండలం చిత్రాడ శివారు ఎస్‌బీ వెంచర్స్ ఆవరణలో ఈనెల 14వ తేదీన జరిగే జనసేన ఆవిర్భావ సభ ఏర్పాట్లును రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పరిశీలించారు. జనసేనపార్టీ కార్యక్రమాల నిర్వహణ కమిటీ కన్వీనర్ కల్యాణం శివ శ్రీనివాసరావుతో కలిసి ఆదివారం రాత్రి సభా ప్రాంగణాన్ని పరిశీలించి అక్కడ జరుగుతున్న పనులపై ఆరా తీశారు. ఆయన వెంట జనసేన నాయకుడు కదారి తమ్మయ్యనాయుడు తదితరులు ఉన్నారు.

జనసేన పార్టీ ఆవిర్భావ సభ విజయవంతం చేయాలి

● జనసేన కాకినాడ జిల్లా ఇన్‌చార్జి తుమ్మల బాబు

పెద్దాపురం: ఈనెల 14న పిఠాపురంలో నిర్వహించనున్న జనసేన ఆవిర్భావ సభను విజయవంతం చేయాలని కాకినాడ జిల్లా జనసేన పార్టీ ఇన్‌చార్జి, కౌడా చైర్మన్ తుమ్మల రామస్వామి(బాబు)కోరారు. స్థానిక రాజుగారి వీధిలో ఉన్న ఆర్యవైశ్య కల్యాణ మండపంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యకర్తలు ఆవిర్భావ దినోత్సవంలో సైనికుల్లా పనిచేయాలన్నారు. జిల్లా నుంచి భారీ ఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నేతలు గడపా ల అప్పారావు, కిరణ్‌కుమార్, పొలమరశెట్టి సత్తిబాబు పాల్గొన్నారు.



జనసేన ఆవిర్భావ సభ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నియోజకవర్గ జనసేన సమన్వయకర్త రాజు, జనసేన ఆవిర్భావ సభ ఏర్పాట్లు పరిశీలిస్తున్న రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ

మద్యంషాపు వద్దంటూ మహిళల ధర్నా, రాస్తారోకో

● మూడు గంటలకుపైగా ఆందోళన



గొల్లప్రోలు: చేబ్రోలు మల్లవరం సెంటర్‌లో ధర్నా, రాస్తారోకో నిర్వహిస్తున్న మహిళలు

గొల్లప్రోలు, మార్చి9(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామంలోని మల్లవరం సెంటర్‌వద్ద మద్యం షాపు ఏర్పాటు చేయవద్దంటూ ఆదివారం మహిళలు ఆందోళనకు దిగారు. ప్రధాన ఆర్‌అండ్‌బీ రహదారిపై ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. నిత్యం వందలాది వాహనాలు, ప్రజలు రాకపోకలు సాగించే ఈ సెంటర్‌లో మద్యంషాపు ఏర్పాటు వలన తమకు రక్షణ ఉండదని మహిళలు తెలిపారు. గతంలో ఇక్కడ షాపు ఉన్న సమయంలో అనేక ఇబ్బందులు పడ్డామని చెప్పారు. తక్షణం ఇక్కడ ఏర్పాటు చేస్తున్న మద్యం షాపును తొలగించాలని వారు పట్టుబట్టారు. సుమారు మూ డు గంటలపాటు మహిళలు చేసిన ఆందోళనతో ఆర్‌అండ్‌బీ రహదారిపై ట్రాఫిక్ నిలిచిపోయింది. దీంతో గొల్లప్రోలు ఎస్ఐ ఎన్. రామకృష్ణ అక్కడకు చేరుకుని మహిళలతో చర్చలు జరిపారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామని హామీఇచ్చారు. దీంతో వారు ఆందోళన విరమించారు. ఇక్కడ మద్యం షాపు ఏర్పాటును విరమించుకోకుంటే మరలా భారీ ఆందోళన నిర్వహిస్తామని వారు హెచ్చరించారు. ఇదే విషయాన్ని జిల్లా కలెక్టర్, ఇతర అధికారుల దృష్టికి తీసుకువెళతామని తెలిపారు.

మరిడమ్మ దేవస్థానంలో అన్నదానం

పెద్దాపురం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): పెద్దాపురం మరిడమ్మ దేవస్థానంలో ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తుల సౌకర్యార్థం వారం వారం ఈ అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి తెలిపారు. భవిష్యత్‌లో నిత్యాన్నదాన కార్యక్రమం నిర్వహించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు ఆమె తెలిపారు. దేవస్థానం సీనియర్ అసిస్టెంట్ రమణ, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.



మరిడమ్మ దేవస్థానంలో అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

'సమాజ సేవలో లయన్స్ క్లబ్ ముందుంటుంది'



ఏపీఐఐసీ కాలనీలో లయన్స్ కార్యాలయంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

సర్పవరంజంక్షన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్లు, విపత్తులు, నిరుపేదలకు సేవలు అందించడంలో లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ సంస్థ ఎల్లవేళలా ముందుంటుందని లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ ఈశ్వర్‌కుమార్, మాజీ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ బాదం బాలకృష్ణలు అన్నారు. ఆదివారం లయన్స్‌క్లబ్ కాకినాడ స్టార్స్ ఆధ్వర్యంలో రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో 316బి అభినవ సహస్ర లయన్స్ మల్టీ సర్వీస్ సెంటర్ భవనంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా మెడికవర్ హాస్పిటల్స్ తులసి మల్టీస్పెషాలిటీ డెంటల్ హాస్పిటల్స్‌కు చెందిన 12మంది డాక్టర్లు 300 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్టార్ క్లబ్ సభ్యులు కొప్పర్తి సాయికృష్ణ, డీసీ వీఎస్ఆర్ మూర్తి, డీసీ వీ నాగిని, లయన్స్ క్లబ్ స్టార్స్ ప్రెసిడెంట్ షర్మిల, సెక్రటరీ నాగేశ్వరి, ట్రెజరర్ గరికిపర్తి నాగమణి, ఇంద్రగంటి శ్రీనివాస్, అడ్మిన్ ప్రసాద్‌నాయుడు, గణేష్ ప్రసాద్, మల్లాడి రాజేంద్రప్రసాద్, గాంధీ, సుష్మిత, అడబాల రత్నప్రసాద్, నిమ్మకాయల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా సుస్థిరత సాధించాలి

● ఎమ్మెల్సీ పద్మశ్రీ, మాజీ ఎమ్మెల్యే అనంతలక్ష్మి



మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మిని సత్కరిస్తున్న దృశ్యం

సర్పవరంజంక్షన్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మహిళలు తమ మేధస్సుతో అన్నిరంగాల్లో ప్రగతి పథంలో దూసుకుపోతున్నారు. ఆర్థికంగా మరింత సుస్థిరత సాధించాలి. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలకు అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను అందిపుచ్చుకుని అభివృద్ధి సాధించాలని ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కాకినాడ రూరల్ మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మిలు కోరారు. ఆదివారం కార్పొరేషన్ 2వ డివిజన్ తోట సుబ్బారావునగర్‌లో పాలిక రెసిడెన్సీలో కూటమి నాయకురాలు దుగ్గా కుమారి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో మహిళలకు కీలక పాత్ర ఉందన్నారు. ఈ సందర్భంగా కూటమి నాయకురాలు దుగ్గాడ కుమారి ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, మాజీ ఎమ్మెల్యే అనంతలక్ష్మిలతో పాటూ వివిధ రంగాల్లో సేవలు అందిస్తున్న పలువురు ప్రభుత్వ,ప్రైవేట్ ఉద్యోగస్తులు కార్పొరేషన్ టీపీఆర్‌వో శైలజ, మెప్మా ఆఫీసర్ మంగాదేవి, వీవోఏల జిల్లా అధ్యక్షురాలు కందా గంగాభవాని, సీవో నగ్మా, పలివెల గాయత్రి, బొజ్జ భవానిలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మంజులూరి అంతలక్ష్మి, వంకా వరలక్ష్మి, కుసుమ కుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు విద్యా సంస్థల ఇబ్బందులను ఫెడరేషన్ తరఫున ఎదుర్కొంటాం

● యూపీఈఐఎఫ్ రాష్ట్ర లీగల్ అడ్వయిజర్ శ్రీవిజయ్



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్రలీగల్ అడ్వయిజర్ మతుకుమిల్లి శ్రీవిజయ్, పాల్గొన్న పాఠశాలల కరస్పాండెంట్లు

కాకినాడసిటీ, మార్చి 9(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు విద్యా సంస్థలకు ప్రభుత్వం నుంచి వచ్చే ఎటువంటి ఇబ్బందుల నైనా ఫెడరేషన్ తరఫున ఎదుర్కొంటామని యునైటెడ్ ప్రైవేట్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఫెడరేషన్ (యూపీఈఐఎఫ్) రాష్ట్ర లీగల్ అడ్వయిజర్ మతుకుమిల్లి శ్రీవిజయ్ హామీ ఇచ్చారు. స్థానిక సూర్యకళా మందిరంలో ఆదివారం యూపీఈఐఎఫ్ ఆధ్వర్యంలో ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా ప్రైవేట్ పాఠశాలల దశ-దిశ సర్వసభ్య వార్షిక సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఫెడరేషన్ సంయుక్త కార్యదర్శి సుజ్ఞాన్ కుమార్ అధ్యక్షత వహించారు. ఫెడరేషన్ చైర్మన్ దాసరి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి యర్రంశెట్టి సురేష్, ఆదర్శ విద్యాసంస్థల చైర్మన్ కనకరాజు, మండల నాయకులు జ్యోతి ప్రజ్వలన చేసి సర్వసభ్య సమావేశాన్ని ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఫెడరేషన్ రాష్ట్రలీగల్ అడ్వయిజర్ శ్రీవిజయ్ మాట్లాడుతూ వచ్చే నాలుగు నెలలు ప్రతి పాఠశాలకు అత్యంత కీలకమైన సమ యమని, ప్రతి కరస్పాండెంట్ వారి పాఠశాల అభివృద్ధికి కష్టపడి పని చేయాలన్నారు. ఫెడరేషన్ చైర్మన్ శ్రీనివాసరావు మాట్లాడుతూ గడిచిన సంవత్సర కాలంలో ఫెడరేషన్‌చేసిన కార్యక్రమాలు, సాధించిన విజయాలు సభ్యులకు వివరించారు. ఆదర్శ చైర్మన్ కనకరాజు మాట్లాడుతూ కేజీ టు పీజీ వరకు అన్ని విద్యాసంస్థలకు శ్రీవిజయ్ దశ దిశ నిర్దేశం చేయగలరన్నారు. ఈ సమావేశంలో ఫెడరేషన్ మండల నాయకులు, అధికసంఖ్యలో పాఠశాలల కరస్పాండెంట్లు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష కుంకుమార్చన

● భారీగా తరలివచ్చిన మహిళలు

గొల్లప్రోలురూరల్, మార్చి9 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో ఉన్న అపర్ణాదేవి ఆలయంలో ఆది వారం సామూహిక లక్ష కుంకుమార్చన పూజలు వైభవంగా జరిగాయి. అపర్ణా సమేత నాగేశ్వరస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన వేదికపై అపర్ణా అమ్మ వారి ఉత్సవమూర్తులను ఉంచారు. అమ్మవారిని పుష్పాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకించారు. ఆలయ వేదపండితులు ఆకొండి వెంకటేశ్వరశర్మ, ప్రభాకరశాస్త్రిలు పూజాది కార్యక్రమాలు జరిపించారు. పూజల్లో పాల్గొనేందుకు జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన మహిళలు భారీగా తరలివచ్చారు. కుంకుమార్చనలను జరిపించారు. ఆలయకమిటీ చైర్మన్ కుంపట్ల సత్యనారాయణ ఇతర సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



తాటిపర్తి అపర్ణాదేవి ఆలయంలో జరిగిన లక్ష కుంకుమార్చన పూజల్లో పాల్గొన్న మహిళా భక్తులు, పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు



వెంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేస్తున్న వేదపండితులు

వెంకన్న బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

పిఠాపురం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహణలో పిఠాపురం పట్టణంలో ఉన్న పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. 15వ తేదీ వరకూ జరిగే ఈ బ్రహ్మోత్సవాలకు రాత్రి అంకురార్పణ జరిగింది. టీటీడీ వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య పూజాది కార్యక్రమాలు, దీక్షా తిరుమంజనం నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు ప్రత్యేక అలంకారం చేశారు. కార్యక్రమాల్లో టీటీడీ టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సోమేశ్వరస్వామి కల్యాణం



కల్యాణ పూజలలో స్వామి, అమ్మవారు

సామర్లకోట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట మండలం వేట్లపాలెం గ్రామంలో ఉన్న రాజరాజేశ్వరి సమేత సోమేశ్వరస్వామి దివ్య కల్యాణ మహోత్సవం ఆదివారంరాత్రి ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు పాలచర్ల రాంబాబు, పాలచర్ల సతీష్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో ముందుగా ఉదయం స్వామివారి రథోత్సవం, అన్నదానం నిర్వహించి ఉత్సవమూర్తులను గ్రామోత్సవం అనంతరం ఆలయ మండపంవద్ద ఉత్సవమూర్తులకు కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. వందలాది భక్తులు హాజరయ్యే కల్యాణ మహోత్సవాన్ని తిలకించి ప్రసాదాలు స్వీకరించారు. ఈనెల 12న సాయంత్రం ప్రముఖ ఆధ్యాత్మిక గురువు రాదా మనోహర్‌దాస్ స్వామిచే ప్రవచనాలు పేరిట ఆధ్యాత్మిక ప్రసంగాలు నిర్వహించనున్నట్లు కమిటీ ప్రతినిధులు తెలిపారు.

జాతీయ కృత్రిమ దంతాల దినోత్సవం

సర్పవరంజంక్షన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక నాగమల్లితోట జంక్షన్‌లో శ్రీసత్య దంత వైద్యశాల సమావేశ మందిరంలో కాకినాడ ఐడీఏ ఆధ్వర్యంలో ఘనంగా జాతీయ కృత్రిమ దంతాల దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ఐడీఏ కార్యదర్శి డాక్టర్ అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ సంపూర్ణ ఆరోగ్యం కోసం దంతాల సంరక్షణ తప్పనిసరన్నారు. కృత్రిమ దంతాలు అనేవి కోల్పోయిన దంతాలను భర్తీ చేయడమేనన్నారు. వృద్ధాప్యం, చిగుళ్ల వ్యాధి, గాయం తదితర కారణాలతో దంతాలు కోల్పోయిన వారికి ఈ కృత్రిమ దంతాలు ఎంతో సౌలభ్యంగా ఉంటాయన్నారు. డాక్టర్ సిరాజ్, డాక్టర్ శ్రీవల్లి పాల్గొన్నారు.

ఆవిర్భావ సభ పోస్టర్ ఆవిష్కరణ

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 9(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ నగర అధ్యక్షులు తోటసుధీర్ ఆదేశాల మేరకు ఆదివారం 21డివిజన్ అధ్యక్షుడు మండపాక దుర్గాప్రసాద్, ఉపాధ్యక్షుడు చిక్కం సూరిబాబు కలిసి జనసేన పార్టీ ఆవిర్భావ సభ పోస్టర్‌ను స్థానిక అమ్మవారి గుడిలో పూజలు చేసి అనంతరం కాకినాడ సిటీ సమన్వయకర్త పీలా రామక్రిష్ణచే పోస్టర్‌ను ఆవిష్కరణ చేశారు. నాయకులు అందరూ కలిసి ఇంటింటికీ వెళ్లి ఓటేసి గెలిపించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు దుగ్గన బాబ్జి, 20డివిజన్ అధ్యక్షులు బసవ నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

జనసేన వసతి కమిటీకి అనుబంధంగా మరో 26 మందికి చోటు

సర్పవరం జంక్షన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 14వ తేదీన పిఠాపురం నిర్వహించనున్న జనసేన ఆవిర్భావ సభకు వచ్చే అతిథులకు వసతి (అకామిడేషన్) కమిటీకి అనుబంధ కమిటీకి 26 మంది సభ్యులను నియమిస్తూ ఆపార్టీ పీఏసీ సభ్యులు, ఎమ్మెల్యే పంతం నానాజీ ఉత్తర్వులు జారీ చేశారు. అనుబంధ కమిటీ సభ్యులుగా పోసిన రాము, నందిపాటి త్రిమూర్తులు, గొల్లపల్లి బాబీ, సోదె ముసలయ్య, పెరికల గౌతమ్, సలాది శ్రీనివాస్, పాలెపు శివ కిషోర్, కర్రి శ్రీనివాస్, ముద్దన రవి, మామిడాల వెంకటేష్, గిరిజాల లక్ష్మి, ఎల్లుర్తి లక్ష్మీనారాయణ, నగబత్తుల రాంబాబు, పాండ్రంకి రాజు, చవ్వాకుల సందీప్, నల్లం శ్రీరాములు, మెర్త మాలతి, నూకల నారాయణరావు, మల్లిపూడి ఈశ్వర్, పితాని రాజకుమారి, వెలవల పల్లిశర్మ, మాగపు గోవిందు, అబ్బిరెడ్డి శివనారాయణ, సైనవరపు శంకర్, బండారు మణికంఠ, ర్యాలీ సతీష్‌లను నియమించినట్లు ఎమ్మెల్యే నానాజీ తెలిపారు. వీరు ప్రధాన అకామిడేషన్ కమిటీకి అనుబంధంగా సేవలు అందిస్తారన్నారు.

మహిళల ఆరోగ్య పరిరక్షణకు మెడికవర్ కృషి

సామర్లకోట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మహిళలు నిత్యజీవనంలో ఎదుర్కొనే పలు ఆరోగ్య సమస్యల పట్ల అవగాహన కలిగి ఉండడం ఎంతో మేలని ఐపీఎస్ అధికారిణి సుస్మితా రాంనాథన్, ఐసీఎంఆర్ డాక్టర్ శ్యామల పేర్కొన్నారు. ఆదివారం సామర్లకోట మండలం పనసపాడు మెడికవర్ ఆసుపత్రి ఆవరణలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల ముగింపు కార్యక్రమం మెడికవర్ సెంటర్ హెడ్ శుభాకరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. మహిళలకు సమగ్ర ఆరోగ్య సేవ లందించేందుకు ప్రత్యేక హెల్త్ ప్యాకేజీని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ గౌతమ్‌రామ్, తదితర వైద్యులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ముద్రగడ గిరిబాబు పర్యటన

ప్రత్తిపాడు, మార్చి 9(ఆంధ్రజ్యోతి): శరభవరం, గజ్జెనపూడి గ్రామాల్లో ఆదివారం వైసీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు పర్యటించారు. ఈరెండు గ్రామాల్లోని వైసీపీ నాయకులు, కార్యకర్తలను, గ్రామస్తులను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో గజ్జెనపూడి సర్పంచ్ గొనగాల అప్పలరాజు, వైసీపీ నాయకుడు రామిశెట్టి నాని, ధారా రమణ, కుబేర, గుడాల వెంట రత్నం, తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

పాపికొండలకు పోటెత్తిన పర్యాటకులు



పోశమ్మగండి బోటు పాయింట్ వద్ద తనిఖీలు చేస్తున్న పోలీసులు

దేవీపట్నం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): పాపికొండలు విహారయాత్రకు తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి ప్రకృతి అందాలు ఆస్వాదించేందుకు ఆదివారం పర్యాటకులు తరలివచ్చారు. పోశమ్మగండి బోటు పాయింట్ నుంచి ఆరు బోట్లలో 316మంది పర్యాటకులు గోదావరి ముంపు పరీవాహక ప్రాంతాలైన పూడిపల్లి, దేవీపట్నం, పోశమ్మగండి తదితర గ్రామాల మీదుగా పేరంటాలపల్లి వెళ్లి సుమారు 2గంటలు పాటు గడిపి వెనుదిరిగారు. ముందుగా పోశమ్మగండి అమ్మవారిని దర్శించుకున్నారు. పాపికొండలకు వెళ్లే పర్యాటకుల బ్యాగులను ఎస్ఐ షరీఫ్ ఆధ్వర్యంలో సిబ్బంది తనిఖీ చేశారు. విహారయాత్రకు మద్యం బాటిళ్లు తీసుకెళ్లకుండా విస్తృతంగా పరిశీలించారు.

గండిపోశమ్మ ఆలయానికి భక్తులు

మండల పరిధిలో ఉన్న మాతృశ్రీ గండి పోశమ్మ అమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు. మైదాన ప్రాంతాల నుంచి వేకువజామునే అమ్మవారి ఆలయానికి చేరుకుని పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

రోడ్డుపై రాళ్లు తొలగించాలి



రోడ్డుపక్కనే ఉన్న బండ రాళ్లు

దేవీపట్నం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాముగండి రోడ్డులో గజ్జలమ్మగుడి గండిలో రోడ్డుపై రాళ్లు ఉండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని పాముగండి మాజీ సర్పంచ్ కోసు లచ్చన్నదొర అన్నారు. పెద్ద బండరాళ్లు రోడ్డు పక్కన దొర్లి ఉన్నాయి. ఇటీవల ఈ రోడ్డులో ఆటో వస్తుండగా రాయి జారి ఆటో మీదకు రాబోయింది కాని త్రుటిలో ప్రమాదం తప్పింది. దీనిపై చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ స్పందనలో వినతిపత్రం అందించామని, అయితే పంచాయతీరాజ్ రాజ్ జేఈ నివేదిక పంపినా పీవో ఇంకా పట్టించుకోలేదని లచ్చన్నదొర ఆరోపించారు. ఇప్పటికైనా పీవో స్పందించి రాళ్లను తొలగించాలని కోరారు.

జల విద్యుత్ కేంద్రాల తనిఖీ



డొంకరాయి డ్యామ్‌ని పరిశీలిస్తున్న గోదావరి రివర్‌బోర్డు మేనేజ్‌మెంట్ అధికారులు, సీలేరు కాంప్లెక్స్ అధికారులు

మోతుగూడెం, మార్చి9 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెం సీలేరు కాంప్లెక్స్ పరిధిలోని జలాశయాల వివరాలు సేకరించిన గోదావరి రివర్‌బోర్డు మేనేజ్‌మెంట్ అధికారులు పొల్లూరు జల విద్యుత్ కేంద్రం నిర్వహణ చాలా బాగుందని గోదావరినది బోర్డు చైర్మన్ అజయ్ కుమార్ పేర్కొన్నారు. బాధ్యతలు చేపట్టిన ఆయన శనివారం పొల్లూరు జల విద్యుత్ కేంద్రాన్ని సందర్శించారు. మొదట కొత్తగా నిర్మిస్తున్న ఐదు, ఆరు యూనిట్ల పనితీరు విధానం గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ ఉత్పాదన తీరును ప్రాజెక్టు అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఫోర్‌బై జలాశయాన్ని సందర్శించి అక్కడ నీటి నిలువ వివరాలుపై ఆరా తీశారు. అక్కడ నుంచి డొంకరాయి మెయిన్ డ్యాంకి పవర్ కెనాల్ జలాశయాలను గోదావరి రివర్ బోర్డు అధికారులు పరిశీలించారు.ఈ కార్యక్రమంలో సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావు, సివిల్ ఎస్ఈ చంద్రశేఖర్ రెడ్డి, లోయర్ సీలేరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వరప్రసాద్, ఏడీఈ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగిన గిరిజన రైతు మృతి



పోతుబంది సత్యనారాయణ (ఫైల్)

రాజవొమ్మంగి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): రాజవొమ్మంగి మండలం లాగరాయి గ్రామానికి చెందిన గిరిజన రైతు చేసిన అప్పులు తీర్చలేననే భయంతో పొలానికి కొట్టేందుకు తెచ్చిన పురుగుల మందు తాగి మృతిచెందినట్టు రాజవొమ్మంగి పోలీసులు తెలిపారు. లాగరాయికి చెందిన పోతుబంది సత్యనారాయణ(48) 4 ఎకరాల్లో వేసిన వరిపంట చేతికి రాక పోగా అప్పు చేసి మరో 3 ఎకరాల్లో వైట్ బార్లీ పొగాకు సాగు చేస్తున్నాడు. కానీ దిగుబడి అంతంత మాత్రంగా ఉండడంతో చేసిన అప్పులు తీర్చలేననే భయంతో మనస్థాపానికి గురైన సత్యనారాయణ శుక్రవారం సాయంత్రం పురుగులమందు తాగాడు. అతడిని లాగరాయి ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లి ప్రాథమిక వైద్యం అందించి కాకినాడ జీజీహెచ్‌కు మెరుగైన వైద్యం నిమిత్తం తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి తీవ్రగాయాలు



ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అర్జునుడు

రాజవొమ్మంగి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): రాజవొమ్మంగి గ్రామ శివారులో జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు తీవ్రంగా గాయపడ్డాడు. దూసరపాము గ్రామానికి చెందిన ఐతిరెడ్డి అర్జునుడు రోడ్డు దాటుతుండగా ఒట్టిగెడ్డ నుంచి రాజవొమ్మంగి వైపు వెళ్తున్న కారు ఆయన్ను ఢీకొంది. దీంతో అర్జునుడు ఎడమ కాలు నుజ్జునుజ్జు అవ్వగా ఒంటిపై గాయాలయ్యాయి. పీహెచ్‌సీకి తరలించి అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు.

అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి సాయం



అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

రాజవొమ్మంగి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లాగరాయి గ్రామంలో షేక్ దాదా టైలరింగ్ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతడి ఇల్లు అగ్నికి ఆహుతైంది. మంటలకు ఇంట్లోని సామాగ్రి, మిషన్ మొత్తం కాలిపోయి వారు నడిరోడ్డున పడ్డారు. వారికి ప్రభుత్వం నుంచి అన్ని విధాల సాయం అందేలా చూస్తామని సర్పంచ్ మిరియాల ఘనలక్ష్మి చెప్పారు. తక్షణ సాయం కింద రూ.2వేలు, బియ్యం, సరుకులు అందజేశారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

ఘనంగా వెంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ



పూజలో పాల్గొన్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్

జగ్గంపేట, మార్చి 9(ఆంధ్రజ్యోతి): కాట్రావులపల్లిలో శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి వారి ఆలయ పునః నిర్మాణం, విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈకార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ పాల్గొన్నారు. తొలుత ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి వారిని దర్శించుకుని తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు. ఈసందర్భంగా జ్యోతుల నవీన్ మాట్లాడుతూ 150 ఏళ్ల చరిత్ర గల వెంకటేశ్వరస్వామి ఆలయం పునః నిర్మాణానికి గ్రామస్థులందరూ ముందుకు రావడం అభినందనీయమన్నారు. కలియుగ దైవం వెంకటేశ్వరస్వామి ఆశీస్సులతో ఈప్రాంతమంతా సుభిక్షంగా ఉండాలని కోరుకున్నానన్నారు. జీను మణిబాబు, జెడ్.రాగంపేట సర్పంచ్ కందుల చిట్టిబాబు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు ముసిరెడ్డి నాగేశ్వరరావు, ఏలేటి బాబి, కాట్రావులపల్లి మాజీ సర్పంచ్ సుంకర సీతారామయ్య, వెన్న వీరబాబు, బీజేపీ నాయకులు కందుల వెంకట అచ్యుత రామారావు, శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా వస్తే ఆహ్వానించండి

● బలవంతపు చేరికల జోలికి వెళ్లొద్దు
● శ్రేణులకు యనమల హితవు



పార్టీ నాయకులను ఉద్దేశించి మాట్లాడుతున్న యనమల

తుని రూరల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల అధ్యక్షుడు చొక్కా అప్పారావు అధ్యక్షతన టీడీపీ మండల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు హాజరయ్యారు. పార్టీ శ్రేణులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ పల్లెప్రగతికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. గ్రామ నాయకులుప్రజల అవసరాలు గుర్తించి అభివృద్ధి పనుల ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. ప్రతి పథకం పారదర్శకంగా ప్రజలకు చేరవ చేయాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. ఏకపక్ష నిర్ణయాలు విడనాడి సమష్టిగా పని చేయాలని సూచించారు. ఎవరైనా పార్టీలోకి వస్తే స్వాగతించాలని, అంతేగాని బలవంతపు చేరికలకు చోటివ్వద్దని ఆయన అన్నారు. సమావేశంలో సీనియర్ నాయకులు యనమల రాజేష్, విజయబాబు, కె.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

కిశోర్‌బాబుకు యనమల పరామర్శ



కిశోర్‌బాబును పరామర్శిస్తున్న యనమల

తుని రూరల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే అశోక్‌బాబు సోదరుడు కిశోర్‌బాబును టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు పరామర్శించారు. కొన్నాళ్లుగా కిశోర్‌బాబు అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో అశోక్‌బాబు నివాసానికి ఆయన వెళ్లి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మాజీ మున్సిపల్ చైర్మన్ ఇనుగంటి సత్యనారాయణ, సీనియర్ నేతలు చింతంనీడి అబ్బాయి, యనమల లక్ష్మణరావు, తమరాన సత్యనారాయణ, చోడ్రాజు చిరంజీవి రాజు, తదితరులు ఉన్నారు.

సత్యదేవుడి సన్నిధిలో భారత నౌకా దళం సభ్యులు



సత్యదేవుడి దర్శనానంతరం ఇండియన్ నేవల్ టీం

అన్నవరం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): అన్నవరం సత్యదేవుడిని ఆదివారం భారత నౌకాదళ టీం సభ్యులు దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు. కొల్‌కతా నుంచి కన్యాకుమారి వరకు మూడు వేల కిలోమీటర్లు మోటార్‌బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నారు. తొలుత ఆదివారం అన్నవరం చేరుకున్న వారికి ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేకదర్శనం కల్పించారు.

లోవకి పోటెత్తిన భక్తులు

● ఆలయానికి రూ.3.65 లక్షల ఆదాయం



భక్తులకు దర్శనమిస్తున్న తలుపులమ్మ

తుని రూరల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): తలుపులమ్మ లోవ ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచే తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు లోవకి తరలివచ్చారు. అమ్మవారి దర్శనానికి భక్తులు ప్రత్యేక క్యూలైన్‌లో బారులు తీరారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించారు. కుటుంబ సమేతంగా లోవకి వచ్చిన భక్తులు ఆలయ ప్రాంగణంలో వంటా, వార్పులు చేసుకుని కుటుంబ సమేతంగా భోజనాలు చేశారు. ఆదివారం ఒక రోజే ఆలయానికి వివిధ విభాగాల ద్వారా రూ.3.65 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో విశ్వనాథ్‌రాజు తెలిపారు.

ఆదిత్యలో జాతీయ స్థాయి టెక్నికల్ ఫెస్ట్



జాతీయ స్థాయి టెక్నికల్ ఫెస్ట్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

గండేపల్లి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): సూరంపాలెం ఆదిత్య విశ్వవిద్యాలయం సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ది స్ట్రెంత్ ఆఫ్ యాన్ ఇంజనీర్ అనే అంశంపై రెండు రోజులు జాతీయ స్థాయి టెక్నికల్ ఫెస్ట్‌ను విజయవంతంగా నిర్వహించారు. కార్యక్రమంలో 150కిపైగా జట్లు, దేశవ్యాప్తంగా వివిధ ఇంజనీరింగ్ కళాశాలల నుంచి 190కిపైగా విద్యార్థులు హాజరయ్యారు. ఈఫెస్ట్‌లో వరంగల్ ఎస్ఆర్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ పి.స్వామి నాగరత్నగిరి అతిథి ఉపన్యాసం చేశారు. ఇండస్ట్రీ ఇనిస్టిట్యూట్ అండ్ ఇంజనీర్స్ ఫోరం నిర్వహించిన ప్రత్యేక ఇంటరాక్టివ్ సెషన్ ఆకట్టుకుంది. ఈకార్యక్రమం నేటి వాస్తవ ప్రపంచ ఇంజనీరింగ్ సవాళ్లపై విలువైన సమాచారం విద్యార్థులకు అందించింది.

కార్యక్రమంలో డిప్యూటీ ప్రోచాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, ప్రో వైస్‌చాన్సలర్ డాక్టర్ రమాశ్రీ, వైస్‌చాన్సలర్ డాక్టర్ ఎంబీ శ్రీనివాస్, రిజిస్ట్రార్ డాక్టర్ జి.సురేష్, విభాగాధిపతి డాక్టర్ రామ్మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సూరిబాబుకు జ్యోతుల నవీన్ పరామర్శ



సూరిబాబును పరామర్శిస్తున్న జ్యోతుల నవీన్

జగ్గంపేట, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మల్లిశాల గ్రామ మాజీ సర్పంచ్, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ పైడిపాల సూరిబాబు కాలుకు ఆసుపత్రిలో చికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ జడ్పీ చైర్మన్ జ్యోతుల నవీన్ ఆదివారం సూరిబాబును పరామర్శించారు. ఆరోగ్య విషయాలు, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జీను మణిబాబు, కందుల చిట్టిబాబు, దేవరపల్లి మూర్తి, మల్లిశాల సర్పంచ్ సర్వసిద్ధి లక్ష్మణరావు, సియాదుల పెద్దకాపు, తొట్టిపూడి నాగేశ్వరరావు, మిరియాల వెంకటేశ్వరరావు, గండి వెంకన్న, పొగరు యేసుబాబు, చాట్రాతి జగ్గారావు, బొమ్మిడి చక్రరావు, సియోధుల శివ తదితరులు పాల్గొన్నారు.


వైభవంగా కొండరాజులుబాబు జాతర



పూజలు చేస్తున్న పెద్దింశెట్టి వెంకటేశ్వరరావు, తదితరులు

ప్రత్తిపాడు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): పెదశంకర్లపూడి గ్రామంలో కొండరాజులుబాబు జాతర మహోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. స్థానిక కొండపై కొలువైన కొండరాజులుబాబు ఆలయం కొండ దిగువన ఉన్న లవకుశల ఆలయాల వద్ద భక్తులు పూజలు నిర్వహించారు. శెట్టిబలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈఉత్సవం నిర్వహించారు. ఆ సంఘానికి చెందిన తెలుగు జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడు పెద్దింశెట్టి వెంకటేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు పాలిక శ్రీను, స్థానిక నాయకుడు పిల్లి శ్రీనులు కొండరాజులుబాబు ల ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా అధ్యక్షుడు పాలిక శ్రీను మాట్లాడుతూ కొండ రాజులు బాబు ఆలయ అభివృద్ధికి సహకారం అందిస్తామన్నారు. ఆలయ గోడలు, ప్లాస్టింగ్ తదితర పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

తాళ్లూరు తిరునాళ్లకు భారీ బందోబస్తు



సిబ్బందికి పలు సూచనలు చేస్తున్న డీఎస్పీ శ్రీహరిరాజు

గండేపల్లి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): తాళ్లూరు గ్రామంలో జియ్యన్నమఠంలో వెలసిన వెంకటేశ్వరస్వామి తిరునాళ్లు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈతిరునాళ్లకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశాలు ఉన్నాయి. ఈతిరునాళ్లలో ఎటువంటి ఘర్షణలు, అసాంఘిక కార్యక్రమాలు చోటుచేసుకోకుండా ఉండేందుకు పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు నేతృత్వంలో జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్, ఎస్ఐ శివ నాగబాబు ఆధ్వర్యంలో ముగ్గురు ఎస్ఐలు, 30 మంది సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ఆదివారం ఆలయ ప్రాంగణంలో పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిజు భద్రతా ఏర్పాట్లపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆలయ ప్రాంగణంలో పోలీసు గస్తీ పకడ్బందీగా నిర్వహించి తిరునాళ్ల ప్రశాంతంగా జరిగేలా చూడాలన్నారు. ఆలయ ఈవో ఉనమట్ల రాజేష్, ఆలయ కమిటీ చైర్మన్ దాపర్తి సీతారామయ్య మాట్లాడుతూ భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.

బీసీ, ఓబీసీ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడిగా వీరబ్రహ్మం



నూతన అధ్యక్షుడిని సత్కరిస్తున్న కార్యవర్గ సభ్యులు

అన్నవరం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): బీసీ, ఓబీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా గుత్తుల వీరబ్రహ్మం ఎంపికయ్యారు. ఆదివారం అన్నవరంలో ప్రస్తుత అధ్యక్షుడు ఎస్వీఆర్ విఠల్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఎన్నుకున్నారు. మహిళా రాష్ట్ర అధ్యక్షురాలిగా దేవదాయశాఖలో పనిచేస్తోన్న హేమలత బాధ్యతలు స్వీకరించనున్నారు. రాష్ట్రంలో అన్నిశాఖల్లో ఉన్న బీసీ, ఓబీసీ ఉద్యోగుల సంక్షేమానికి పోరాడతానని, సమస్యల పరిష్కారానికి శ్రమిస్తానన్నారు. కార్యక్రమానికి వివిధ జిల్లాల ఉద్యోగసంఘాల కార్యవర్గ సభ్యులు హాజరయ్యారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడిగా విద్యుత్ శాఖలో ఏడీఈగా పనిచేస్తోన్న చొల్లంగి శ్రీధర్ వ్యవహరించనున్నారు. ఎన్నిక అనంతరం ఉద్యోగుల సంఘం పలు తీర్మానాలు చేసింది. బీసీ కులగణన చేపట్టాలని, ప్రతీ జిల్లాలో స్థలం కేటాయించి ప్రభుత్వం బీసీ భవనాలు నిర్మించాలని, పూలే జన్మదినాన్ని రాష్ట్ర ప్రభుత్వం సెలవు రోజుగా ప్రకటించాలని, బీసీలకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ తీర్మానం చేశారు. కార్యక్రమంలో దేవదాయశాఖాధికారి చందక దారబాబు తదితరులు పాల్గొన్నారు.

సత్యదేవుడికి వేడుకగా రథోత్సవం



రథోత్సవంలో ఈవో సుబ్బారావు దంపతులు

అన్నవరం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): సత్యదేవుడికి ఆదివారం వారాంతపు ఆర్జిత సేవ రథోత్సవం వేడుకగా జరిగింది. ఉదయం 10 గంటలకు స్వామి,అమ్మవార్లను రథంపై ఆశీనులు గావించారు. పండితుల ప్రత్యేకపూజలు అనంతరం భక్తుల గోవిందనామస్మరణల నడుమ ముమ్మారు ప్రదక్షణ గావించారు. చతుర్వేద పండితుల వేదాశీర్వచనాలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

జనసేన ప్లీనరీలో ఎన్ఎంఆర్‌ల రెగ్యులరైజేషన్‌పై ప్రస్తావించాలి



తుమ్మల రామస్వామికి వినతిపత్రం అందజేస్తున్న ఎన్ఎంఆర్ ఉద్యోగుల సంఘ నాయకులు

అన్నవరం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మూడు దశాబ్దాలుగా ఎన్ఎంఆర్‌గా పనిచేస్తోన్న ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, జనసేన ప్లీనరీలో ఈవిషయం ప్రస్తావించాలని ఎన్ఎంఆర్ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు ఆ పార్టీ నేత తుమ్మల రామస్వామిని కోరారు. ఆదివారం సత్యదేవుడి దర్శనానికి విచ్చేసిన ఆయనను ఉద్యోగుల సంఘ ప్రతినిధులు రమణ, కొత్తపల్లి సత్యనారాయణ, చిరంజీవి, పప్పుల బాబూరావు, గణేష్ తదితరులు కలిసి వినతిపత్రం అందించారు. ఈఅంశం ప్లీనరీలో ప్రస్తావించడంతో పాటు ప్లీనరీలో పార్టీ అధినేత పవన్‌కల్యాణ్‌ను కలిసే అవకాశం కల్పిస్తానని హామీఇచ్చారు.

ఆర్టీసీ కార్మికుల రిలే నిరాహార దీక్షలు

ఏలేశ్వరం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా సస్పెండ్ చేసిన ఆర్టీసీ డ్రైవర్ ఎస్వీ రమణను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని జేఏసీ నేతృత్వంలో ఆదివారం కూడా రిలే నిరాహార దీక్షలు సాగించారు. ఎంప్లాయీస్ యూనియన్, యునైటెడ్ యూనియన్ సభ్యులు డిపో గేటు వద్ద మధ్యాహ్న భోజన సమయంలో రిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ డిపో కార్యదర్శి యుబీఎం కుమార్, యునైటెడ్ ఎంప్లాయీస్ యూనియన్ డిపో కార్యదర్శి ఎన్‌పి రావు, త్రిమూర్తులు, పలువురు కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

పది పరీక్షలకు సర్వం సిద్ధం

తొండంగి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో పదవ తరగతి పరీక్షల నిర్వహణకు సర్వం సిద్ధం చేసినట్టు మండల విద్యాశాఖాధికారి షేక్ బాబ్జి తెలిపారు. తొండంగి, దానవాయిపేట, పెరుమాళ్ళపురం, బెండపూడి సెంటర్లలో పరీక్షలు జరుగుతాయన్నారు. తొండంగి, దానవాయిపేటల్లో 250, పెరుమాళ్లపురంలో 245, బెండపూడిలో 205 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు.

నూతన ఆలయం ప్రారంభం

తొండంగి, మార్చి 9(ఆంధ్రజ్యోతి): తొండంగిలో నిర్మించిన నూకాలమ్మ, పెద్దింట్లమ్మ ఆలయాన్ని ఆదివారం ప్రారంభించారు. గతంలో ఉన్న ఆలయాలు శిథిలం కావడంతో వాటి స్థానంలో నూతన ఆలయాన్ని నిర్మించి విగ్రహాలను ఏర్పాటుచేశారు. గ్రామస్తుల ఆధ్వర్యంలో పలు పూజలు జరపగా, అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీ .. యువకుడికి తీవ్రగాయాలు

గండేపల్లి, మార్చి 9(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. రాజానగరం మండలం దివాన్‌చెరువుకు చెందిన సుంకర నవీన్ మోటార్‌సైకిల్‌పై అమ్మమ్మ ఇంటికి మల్లేపల్లి వెళ్తున్నాడు. గండేపల్లి గ్రామ శివారు ఒక హోటల్ ఎదురుగా శనివారం అర్ధరాత్రి నవీన్‌ను గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు అతడ్ని రాజమహేంద్రవరంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. నవీన్ పరిస్థితి విషమంగా ఉందని తెలిసింది. ఈప్రమాదం ఎలా జరిగిందనేపై పోలీసులు ఆ ప్రాంతంలోని సీసీ కెమెరాలు పరిశీలిస్తున్నారు.